ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0
కనిష్ఠం : 26.0

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు

శనివారం 6 జూలై 2024



ఇబ్రహీంపేటలో ప్రస్తుతం నిల్వ ఉన్న ఇసుక

ఇసుక లెక్క తేలుస్తున్నారు

- ఇబ్రహీంపేటలో వేలాది యూనిట్ల నిల్వలపై మైనింగ్ అధికారుల ఆరా

కుక్కునూరు, జూలై 5 : కుక్కునూరు మండలం ఇబ్రహీంపేట ఇసుక రీచ్ పరిధిలో వేలాది యూనిట్ల ఇసుక నిల్వ ఉంది. ఎంత ఇసుక నిల్వ ఉందనే విషయంపై మైనింగ్ శాఖ అంచనా వేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఇబ్రహీంపేట ఇసుక రీచ్‌ను ఒక ప్రైవేటు సంస్థకు ప్రభుత్వం అప్పగించింది. దీంతో ఆ సంస్థ రాత్రి పగలు తేడా లేకుండా గోదావరిలో ఇసుకను యంత్రాలతో తవ్వేశారు. తవ్విన ఇసుకను ఇబ్ర హీంపేట లోని ఒక ప్రాంతంలో భారీగా నిల్వ చేశారు. ఈ క్రమంలోనే రాత్రి సమయాల్లో సరిహద్దును దాటి తెలంగాణకు అక్రమంగా తరలించేవారు. దీనిపై



పత్రికల్లో కథనాలు వచ్చినప్పుడు ఇసుక రవాణా నిలిపి వేసేవారు. అనంతరం యథావిధిగా రవాణా చేస్తుండేవారు. ఈ విషయంలో స్థానిక అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించేవారు. వైసీపీ సర్కార్ స్థానంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో దీనిపై దృష్టి సారించింది. అసలు ఇబ్రహీంపేటలో ఎంత మేర ఇసుక నిల్వలు ఉన్నాయనే విషయంపై మైనింగ్ అధికారులు ఆరా తీస్తున్నారు. ఉన్న ఇసుక నిల్వలను కొలత వేశారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు నివేదించనున్నారు.

నూజివీడు ఐఐఐటీ అధికారుల రాజీనామా !

నూజివీడు, జూలై 5 : రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో పలువురు ఉన్నతాధికారులు రాజీనామా బాట పట్టడం చర్చనీయాంశంగా మారింది. నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ చంద్రశేఖర్‌తో పాటు ఆర్జీయూకేటీ రిజిస్టర్ గోపాలరాజు, సీఈవో ప్రసాద్, డీన్ ఆఫ్ అకాడమిక్స్ శ్రావణి, ఎగ్జామ్స్ ఆఫీసర్ భానుప్రకాశ్ గురువారం తమ రాజీనామాలను ఆర్జీయూకేటీ ఛాన్సలర్‌కు పంపించినట్టు తెలుస్తోంది. అయితే రాజీనామాలను యూనివర్సిటీ ఉన్నతాధికారులు అధికారికంగా ధ్రువీకరించలేదు.



టీడీఆర్ బాండ్ల కొనుగోల్‌మాల్



విమానాశ్రయ భూముల్లో 60 అడుగుల రహదారి ఇదే..

తాడేపల్లిగూడెంలో వైసీపీ నేత దందా

- రూ. 150 కోట్ల విలువైన బాండ్‌లు జారీ
- మార్కెట్‌లో రూ.60 కోట్లకు విక్రయం
- వైసీపీ నేతకు సింహభాగం వాటా
- స్థల యజమానులతో అనేక ఒప్పందాలు
- వైసీపీ ప్రభుత్వం వస్తే బాండ్‌లు ఇచ్చేలా ప్రణాళిక
- ప్రభుత్వం మారిపోవడంతో మారిన తలరాత
- వెలికి తీస్తున్న కూటమి నేతలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తాడేపల్లిగూడెంలో మీ స్థలం వెంబడి మాస్టర్ ప్లాన్ రహదారి వెళ్లింది. అదే స్థలంలో నిర్మాణాలు చేపట్టాలనుకుంటున్నారా ? సొమ్ములు చేతిలో లేవా.. అయితే మున్సిపల్ అధికారులను సంప్రదించండి. మాస్టర్ ప్లాన్ రహదారిలో ఉన్న స్థలానికి టీడీఆర్ బాండ్‌లు ఇచ్చేస్తారు. వాటిని బయట మార్కెట్‌లో అమ్ముకుంటే కోట్ల రూపాయలు వస్తాయి. మాస్టర్ ప్లాన్ రహదారికి ఆనుకుని ఉన్న మిగిలిన స్థలంలో అదే సొమ్ముతో అపార్ట్‌మెంటే నిర్మించుకోవచ్చు. ఇలాగని ఆశపడి వెళితే కుదరదు. నేతలు ముందుకొస్తారు. బాండ్‌లు జారీ చేయిస్తారు. అమ్ముకుంటారు. వారే సొమ్ములు తీసుకుంటారు. లబ్ధిపొందుతారు. మార్కెట్ విలువ ప్రకారం మీ సొమ్ములు మీకు ఇస్తారు. మిగిలిన సొమ్మంతా నేతల జేబులోకి వెళ్లిపోతుంది. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇదే జరిగింది. మాస్టర్ ప్లాన్ రహదారి పేరుతో బాండ్‌లు జారీచేశారు. రహదారిని విస్తరించ లేదు. అదే చోట అనేకమంది స్థల యజమానులు ఇప్పటికీ వ్యాపారాలు చేసుకుంటున్నారు. అంటే బాండ్‌లు జారీచేసిన స్థలాన్ని మున్సిపాలిటీ స్వాధీనం చేసుకోవాలి. రహదారిని విస్తరించాలి. ఇవేమీ చేయడం లేదు. బాండ్‌లు మాత్రం జారీచేసింది. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దాదాపు రూ. 150 కోట్లు విలువైన బాండ్‌లు జారీచేశారు. ఇందులో వైసీపీ నేత కీలకంగా వ్యవహరించారు. కోట్ల రూపాయలు కొల్ల గొట్టారు. మున్సిపాలిటీ జారీచేసిన బాండ్‌లను మార్కెట్‌లో 40 శాతం ధరకు విక్రయించుకున్నారు. అంటే రూ. 60 కోట్ల మేర లబ్ధి చేకూరింది. భీమవరం-తాడేపల్లిగూడెం ప్రధాన రహదారి, పట్టణంలో 40 అడుగుల మాస్టర్ ప్లాన్ రహదారుల్లో బాండ్‌లు జారీ అయిపోయాయి. అప్పటి మున్సిపల్ అధికారులపై ఒత్తిడి తెచ్చి మరీ బాండ్‌లు జారీ చేయించారు. మున్సిపల్ శాఖలో ఉన్నతాధికారి చక్రం తిప్పారు. వారి ఒత్తిడితో క్షేత్ర స్థాయిలో బాండ్‌లు జారీ అయిపోయాయి. స్థల యజమానులు ఒకరైతే... బాండ్‌లు జారీ అయింది నిర్మాణదారులకు. ఇలా ఎన్నో బాండ్‌లు జారీ అయిపోయాయి. మరోవైపు వైసీపీ నేతకు అండగా ఉండే వ్యాపారులు కూడా లబ్ధిపొందారు. తమ దుకాణాలు మాస్టర్ ప్లాన్‌లో రహదారిలో ఉన్నాయి. ఆ స్థలాన్ని మున్సిపాలిటీకి రాసిచ్చేశారు. బాండ్‌లు పొందారు. అమ్ముకున్నారు. ఇప్పటికీ మున్సిపాలిటీకి ఇచ్చిన స్థలంలో వ్యాపారాలు చేసుకుంటున్నారు. తాడేపల్లిగూడెం- భీమవరం రహదారిలో ప్రధాన



మిఠాయి కొట్టు యజమాని ఈ విధంగా భారీ మొత్తంలో లబ్ధి పొందారు. అధికార పార్టీ నేతకు ముడుపులు ముట్ట చెప్పారు.

టీడీఆర్ బాండ్‌లు ఎప్పుడు ఇవ్వాలి

రహదారులు విస్తరించాల్సి వస్తే స్థల యజమానుల నుంచి మున్సిపాలిటీ భూ సేకరణ చేస్తుంది. గజాల్లో తీసుకుంటుంది. అందుకు నాలుగు రెట్లు సరిపడా బాండ్‌లు జారీచేస్తుంది. రహదారి విస్తరిస్తుంది. దీనివల్ల స్థలం కోల్పోయిన యజమానికి ఇబ్బంది ఉండదు. మున్సిపాలిటీ సొమ్ములు ఇవ్వాల్సిన అవసరం లేదు. కేవలం బాండ్‌లు ఇస్తుంది. వాటిని స్థల యజమానులు అమ్ముకుంటారు. లేదంటే తామే వినియోగించుకుంటారు. స్థలం ఇచ్చిన నాలుగు రెట్లు విస్తీర్ణంలో మున్సిపాలిటీ ప్లాన్ లేకుండానే అదనంగా నిర్మాణాలు చేసుకోవచ్చు. దానివల్ల స్థల యజమానులు లబ్ధిపొందుతారు. టీడీఆర్ బాండ్‌లు కొనుగోలు చేసుకున్నా సరే వారుకూడా అనుమతులు లేకుండా అదనంగా నిర్మించుకోవచ్చు. అందుకు విశాఖ, విజయవాడల్లో బిల్డర్‌లు టీడీఆర్ బాండ్‌లను కొనుగోలు చేస్తుంటారు. బాండ్ విలువ మొత్తంలో 40 శాతం ధర ఇస్తారు.దీనిని తాడేపల్లిగూడెం వైసీపీ నేత సద్వినియోగం చేసుకున్నారు. కోట్ల రూపాయలు ఆర్జించారు.

స్థలాలు స్వాధీనం చేసుకోని మున్సిపాలిటీ

టీడీఆర్ బాండ్‌లు జారీచేసిన స్థలాన్ని మున్సిపాలిటీ స్వాధీనం చేసుకోవాలి. తాడేపల్లిగూడెంలో మాత్రం అలా జరగలేదు. రహదారి విస్తరించినప్పుడు తీసుకుంటామని గతంలో అధికారులు చెప్పుకొచ్చారు.వాస్తవానికి తాడేపల్లిగూడెం-భీమవరం రహదారి విస్తరించే అవకాశం లేదని తెలిసి బాండ్‌లు జారీ చేశారు. స్థల యజమానులకు లబ్ధి చేకూర్చారు. టీడీఆర్ బాండ్‌ల జారీలో రూ. 60 కోట్లు మేర చేతులు మారితే వైసీపీ నేతకు పెద్ద మొత్తంలో లబ్ధి చేకూరింది. బాండ్‌లు జారీ చేయించినందుకు బాండ్‌లు జారీ అయిన వ్యక్తుల నుంచి కోట్లాది రూపాయలు తీసుకున్నారు.

సొంత స్థలాన్ని రాసిచ్చిన నేత

విమానాశ్రయ భూములకు ఆనుకుని వైసీపీ నేత 10 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. ఆ భూమి మీదుగా 60 అడుగుల రహదారి వెళ్లేలా మాస్టర్ ప్లాన్ రహదారి సిద్ధం చేశారు. మాస్టర్ ప్లాన్ రహదారిలో పడిన 60 సెంట్ల భూమిని గజాల రూపంలో మున్సిపాలిటీకి రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చేశారు. అదికూడా భీమవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ జరిగింది. అక్కడ ఎకరాల్లో కొనుగోలు చేసి గజాల్లో మున్సిపాలిటీకి రాసిచ్చిన ఘనుడు వైసీపీ నేత. అదేదో మున్సిపాలిటీకి అప్పనంగా ఇచ్చింది కాదు. బాండ్‌లు జారీ అయితే రూ. 15 కోట్లు లబ్ధి చేకూరేది. దానిని ఎన్నికల ముందు కూటమి నేతలు అడ్డుకున్నారు. అప్పటి మున్సిపల్ కమిషనర్ వైసీపీ నేతకు పూర్తి స్థాయిలో సహకరించారు. మున్సిపల్ ఇన్‌ఛార్జ్ అధికారి సంతకం చేయకపోవడంతో బాండ్‌ల జారీ ఆగిపోయింది. రాష్ట్ర స్థాయి అధికారులతో మున్సిపల్ ఇన్‌ఛార్జ్‌పై వైసీపీ నేత ఒత్తిడి తేచ్చే ప్రయత్నం చేశారు. అయినా ఇన్‌ఛార్జ్ అధికారి తలొగ్గలేదు. లేదంటే మున్సిపాలిటీ ఇచ్చే బాండ్‌ల రూపంలో రూ. 15 కోట్లు లబ్ధి పొందేవారు. ఇంతకి వైసీపీ నేత కొనుగోలు చేసిన 10 ఎకరాల భూమి విలువ రూ.12 కోట్లు లోపలే ఉంది. ఆ మొత్తాన్ని కేవలం మున్సిపాలిటీ ఇచ్చే 60 సెంట్లతో లాగేద్దామని వైసీపీ నేత ఆశించారు. టీడీఆర్ బాండ్‌ల జారీ కోసం తీవ్ర ప్రయత్నాలే చేశారు. కూటమి నేతలు అడ్డుపడడంతో పాచిక పారలేదు.

స్థల యజమానులతో ఒప్పందాలు


మరోసారి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని వైసీపీ నేత గట్టిగా నమ్మారు. మాస్టర్ ప్లాన్ రహదారి విస్తరించిన ఉన్న చోట స్థలాలను గుర్తించారు. స్థల యజమానులతో ఒప్పందాలు చేసుకున్నారు. అడ్వాన్స్ రూపంలో సొమ్ములు చెల్లించారు. వైసీపీ అధికారంలో వస్తే ఆ స్థలాలకు బాండ్‌లు ఇప్పించుకునేవారు. మార్కెట్ విలువ ఆధారంగా వారికి సొమ్ములు ఇచ్చేవారు. మరో మూడు రెట్లు సొమ్మును వైసీపీ నేత కాజేసేవారు. ప్రభుత్వం మారిపోవడంతో ప్రణాళిక అడ్డం తిరిగింది. గతంలో జారీ చేసిన టీడీఆర్ బాండ్‌ల వ్యవహారం తెరపైకి వస్తోంది.

అంతా ఒక్కటయ్యారు..!

- వైసీపీ హయాంలో రెండుగా చీలిన నత్తగుల్లపాడు
- ఎమ్మెల్యే కామినేని చొరవ.. మూడున్నరేళ్ల వివాదానికి తెర

కైకలూరు, జూలై 5: కొల్లేరు సరస్సులో అది ఓ చిన్న గ్రామం.. వివాదాలకతీతంగా అభివృద్ధితోపాటు అన్నీ సమస్యలు పరిష్కారమయ్యేవి. అలాంటి గ్రామం గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రెండు వర్గాలుగా చీల్చిపోయి గత మూడున్నరేళ్లుగా ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. కాగా నూతనంగా గెలిచిన ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ రెండు వర్గాల మధ్య సఖ్యతను ఏర్పరిచి గ్రామాభివృద్ధికి ఐక్యతగా పని చేయండంటూ వెన్నుతట్టారు. వివరాలివి..

కైకలూరు మండలం నత్తగుల్లపాడు గతంలో చటాకాయ్ పంచాయతీ పరిధిలో ఉండేది. మూడేళ్ల క్రితం ప్రత్యేక పంచాయతీగా నత్తగుల్లపాడును గుర్తించారు. అప్పటికే గ్రామస్థుల మధ్య స్వల్ప వివాదాలు ఉండేవి. ఇదే అదనుగా వైసీపీ పాలకులు పంచాయతీ ఏకగ్రీవం కానివ్వకుండా ఎన్నికలకు తెరతీశారు. పంచాయతీ ఏర్పడిన మొదటి దఫా ఎన్నికల్లోనే ఇరువర్గాల మధ్యన ఆసక్తికర పోరు జరిగింది. ఈ ఎన్నికల్లో వైసీపీ అనుకూల అభ్యర్థి ముంగర రామకృష్ణంరాజు సర్పంచ్‌గా గెలుపొందారు. కొల్లేరు గ్రామం కావడంతో ఈ వివాదాలు చినికిచినికి పెద్దవి కావడంతో గ్రామాభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. గ్రామ కట్టుబాట్ల మధ్య చెరువుల ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామపెద్దల ద్వారా గ్రామాభివృద్ధికి, ఆలయాల అభివృద్ధికి ఖర్చు చేసేవారు. గతంలో ఏటా గ్రామానికి రూ.20 లక్షల ఆదాయం చెరువుల నుంచి వచ్చేది. అయితే మూడేళ్లుగా చెరువుల పాటలు జరగకుండా గ్రామస్థులు అడ్డుకోవడంతో రూ.60 లక్షలు నష్టం వాటిల్లింది. దీంతో ఆలయాల్లో దీపాలు వెలిగించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని ఎన్నికలకు ముందు కొందరు గ్రామస్థులు డాక్టర్ కామినేని దృష్టికి తీసుకువెళ్లారు. తను గెలిచిన వెంటనే సమస్యకు పరిష్కారం చూపుతానంటూ ఆయన హామీ ఇచ్చారు. దీంతో గ్రామంలో



ఎమ్మెల్యే కామినేనికి కృతజ్ఞతలు తెలుపుతున్న నత్తగుల్లపాడు గ్రామస్థులు

కామినేనికి మెజార్టీని అందించారు. ఈ క్రమంలోనే ఇచ్చిన మాటకు కట్టుబడిన ఆయన గ్రామస్థులంతా ఏకమై నా దగ్గరకు వస్తే మీ సమస్యలను పరిష్కరిస్తానంటూ తెలిపారు. గ్రామస్థులు పలు దఫాలుగా చర్చించుకున్నా సమస్య కొలిక్కి రాలేదు. ఎమ్మెల్యే కామినేని సూచనలతో రాష్ట్ర టీడీపీ వడ్డీ సాధికారిక సమితీ కన్వీనర్ బలే ఏసురాజు ఇరువర్గాలను సమ దాయించి ఒకేతాటి పైకి వచ్చారు. గ్రామస్థులంతా కామినేని ఇంటివద్ద ఆయ నను కలిసి సంఘటితంగా ఉంటామని గ్రామాభివృద్ధికి కృషి చేయాలంటూ కోరారు.

ఇదే స్ఫూర్తితో ఇకపై ప్రజలంతా ఒకే తాటిపై ఉండి గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని చిన్నపాటి సమస్యలు వచ్చినా సమన్వయంతో పరిష్కరించుకోవాలే తప్ప గ్రామాల్లో గొడవలకు ఎవరూ ప్రోత్సహించవద్దని ఎల్లప్పుడు తాను అండగా ఉంటానని కామినేని వారికి అభయమిచ్చారు. దీంతో మూడున్నరేళ్లుగా నెలకొన్న వివాదానికి తెర పడిందని గ్రామస్థులు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ కామినేనికి కృతజ్ఞతలు తెలిపారు.

హెల్మెట్ ధరించాల్సిందే

- ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్న ప్రసాద్



ఏలూరు క్రైం, జూలై 5 : రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా హెల్మెట్ ధరించడం ద్విచక్ర వాహనదారులకు క్షేమమని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అన్నారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనంలో శుక్రవారం ట్రాఫిక్, ట్రాన్స్‌పోర్టు అధికారులైన ట్రాఫిక్ సీఐ కె.శ్రీనివాసరావు, రీజినల్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ కె.శ్రీహరిలతో కలిసి హైకోర్టు ఆదేశాలను అనుసరించి ద్విచక్ర వాహనదారుల భద్రతకు సంబంధించి విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో రత్న ప్రసాద్ మాట్లాడుతూ గతేడాది రాష్ట్రంలో జరిగిన 3,703 ద్విచక్ర వాహన ప్రమాదాల్లో 3,042 మరణించగా వీరిలో 85 శాతం మంది హెల్మెట్ ధరించకపోవడంతోనే మృతి చెందారన్నారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటిస్తూ హెల్మెట్‌ను ధరించి ప్రయాణం చేయాలన్నారు. రోడ్డు భద్రత నియమాలకు, ప్రమాదాలకు సంబంధించి విరివిగా ప్రచార కార్యక్రమాలు, అవగాహన సదస్సులు సంబంధిత ట్రాన్స్‌పోర్టు, పోలీస్ అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేసి హెల్మెట్ లేనివారిపై కేసులు నమోదు చేయడానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. జాతీయ మోటారు వాహన చట్టంలోని రూల్ 167(ఎ) ప్రకారం రోడ్డు భద్రతకు సంబంధించి ఎలక్ట్రానిక్ పరికరాలైన స్పీడ్ కెమెరా, క్లోజ్డ్ సర్క్యూట్, టెలివిజన్ కెమెరా, స్పీడ్‌గన్, బాడీ వెరిబుల్ కెమెరా తదితర టెక్నాలజీ పరికరాలను రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు భద్రతకు వాడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ కె.శ్రీనివాసరావు, ఆర్టీవో శ్రీహరిలు మాట్లాడుతూ ప్రతి ద్విచక్ర వాహన దారుడు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారణలో భాగంగా తనిఖీలు ముమ్మరం చేసి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ నరేంద్ర బాబు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.



లక్ష్మీపురం ఆలయం.. (ఇన్‌సెట్‌లో) సుభద్ర, బలభద్ర, జగన్నాథులు

రేపటి నుంచి లక్ష్మీపురం జగన్నాథుడి రథోత్సవాలు

ద్వారకా తిరుమల, జూలై 5: శతాబ్ద కాలం నాటి పురాతన చరిత్ర కలిగిన లక్ష్మీపురం సంతాన వేణుగోపాల జగన్నాథ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నుంచి జగన్నాథుని రథోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఏటా ఈ ఉత్సవాలను పూరీ క్షేత్రంలో వలె ఇక్కడ శ్రీవారి దేవస్థానం వైభవంగా నిర్వహి స్తోంది. ఈ క్రమంలో పూరీ క్షేత్రం నుంచి తెచ్చిన సుభద్ర, బలభద్ర, జగన్నాథుల దారు విగ్రహాలు ఉత్సవ క్రతువులో ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని పరిసరాలను విద్యుత్ దీపాలతో సుందరీకరించేందుకు దేవస్థానం ఏర్పాట్లు చేస్తోంది. రథోత్సవాల్లో భాగంగా ఈనెల 7న రథవాహనంపై స్వామివారు లక్ష్మీపురం ఆలయం నుంచి సాయంత్రం 5 గంటలకు శ్రీవారి క్షేత్రానికి ఊరే గింపుగా వస్తారు. ఉత్సవాల ముగింపు రోజైన 16న ఆలయం నుంచి సమీప గ్రామమైన తిమ్మాపురానికి సాయంత్రం 5గంటలకు రథయాత్రగా వెళ్లనున్నారు.

దశావతారాలు ఇలా..

రథోత్సవాలను పురస్కరించుకుని ఆలయావరణలోని కల్యాణ మండపంలో జగన్నాథస్వామి రోజుకో ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమీయనున్నారు. 7న మత్స్యావతారం 8న కూర్మ, 9న వరాహ, 10న నృశింహ, 11న వామన, 12న పరశురామ, 13న రామ, 14న కృష్ణా, 15న కల్కి, 16న వేంకటేశ్వరస్వామి అవతారంలో దర్శనమిస్తారు.

పారిశుధ్య కార్మికులపై.. శీతకన్ను!



దుకాణాల వద్ద చెత్తను సేకరించి ట్రాక్టర్‌లో వేస్తున్న పారిశుధ్య కార్మికులు



జంగారెడ్డిగూడెం మునిసిపాలిటీలో ఇదీ వరుస..

జంగారెడ్డిగూడెం మునిసిపాలిటీలో పారిశుధ్య కార్మికులను అధికార వైసీపీ పాలక వర్గం, అధికారులు మూడేళ్లుగా పట్టించుకోలేదు. వారికి కల్పించాల్సిన కనీస సదుపాయాలపై కనీసం కన్నెత్తి చూడలేదు. కోట్ల రూపాయల ఆదాయం వచ్చే జంగారెడ్డిగూడెం పట్టణాభివృద్ధిలో భాగమైన పారిశుధ్య కార్మికులపై పూర్తిగా నిర్లక్ష్యం వహించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో తమ సమస్యలు తీరుతాయన్న ఆశాభావంతో కార్మికులు ఉన్నారు.

- పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగ కార్మికులకు సదుపాయాల ఊసే లేదు
- చేతులకు గ్లౌజులు, కాళ్లకు బూట్లూ కరువే..
- మూడేళ్లుగా పట్టించుకోని అధికారులు, పాలకవర్గం

జంగారెడ్డిగూడెం, జూలై 5 : కరోనా కష్ట కాలంలో తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పారిశుధ్య కార్మికులు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచారు. నిత్యం పట్టణంలో ఎండా, వానా, చలి లెక్క చేయకుండా పట్టణ పరిశుభ్రత కోసం అహర్నిశలు కృషి చేసే పారిశుధ్య కార్మికులు తమ చేతులకు గ్లౌజులు లేకుండా కాళ్ళకు బూట్లు, తలకు టోపీ, శరీరానికి రెయిన్ కోట్లు ఏమీ లేకుండా తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా చెత్త చెదారాలను ఎత్తి చెత్త రిక్షాలోనో, ట్రాక్టర్‌లోనో వేస్తున్నారు. ఇది వారి ఆరోగ్యానికి తీవ్ర హాని చేస్తుందని తెలిసినా విధులు నిర్వహిస్తున్నారు. గత ఐదేళ్లుగా పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరాలు నిర్వహించలేదు. కొందరు కార్మికులు తమ సొంత ఖర్చులతో గ్లౌజులు కొనుక్కుని వాడుతున్నారు. తమకు మౌలిక సదుపాయలు కల్పించాలని ఎన్నిసార్లు అడిగినా అప్పటి మునిసిపల్ కమిషనర్లు ప్రభుత్వం హెల్త్ అలవెన్సు రూ.6 వేలు ఇస్తోందని కాబట్టి పారిశుధ్య కార్మికులకు తామేమీ ఇవ్వనవసరం లేదని తేల్చి చెప్పడం గమనార్హం.



సొంత సొమ్ముతో కొనుగోలు చేసిన గ్లౌజులతో చెత్తను ఎత్తుతున్న మహిళా కార్మికులు

మరోవైపు కార్మికులకు పాలక వర్గం నుంచి కూడా సహకారం లేకపోవడంతో చేసేది లేక మిన్నకుండిపోయారు. గతనెలలో జరిగిన మునిసిపల్ సాధారణ సమావేశంలో ఎన్నికల ముందు కమిషనర్‌గా బాధ్య తలు చేపట్టిన జె.నరేంద్ర కుమార్ మునిసిపాలిటీ తరపున పారిశుధ్య కార్మికులకు, ఇంజనీరింగ్ విభాగ కార్మికులకు సబ్బులు, గ్లౌజులు, బూట్లు, రెయిన్‌కోట్లు, కొబ్బరినూనె, యూనిఫాం, మాస్కులు, చెప్పులు వంటివి కొనుగోలు చేయడానికి పురపాలక సంఘ సాధారణ నిధుల నుంచి రూ.5 లక్షల నిధులు కేటాయించగా మునిసిపల్ కౌన్సిల్ ఆమోదించింది. ప్రస్తుతం వర్షాకాలం కాబట్టి తక్షణం నిధులు విడుదల చేసి తమకు వస్తు సామగ్రి అందించి సదుపాయాలు కల్పించాలని కార్మికులు కోరుతున్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మూడేళ్లుగా పట్టించుకోలేదు..



మున్సిపల్ పారిశుధ్య కార్మికులు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి ఎంతో కష్టపడతారు. గత మూడేళ్లుగా కార్మికులకు పనిలో అవసరమైన సామగ్రి అందించడంలో విఫలమయ్యారు. కమిషనర్ నరేంద్రకుమార్ ఈ ఏడాది కార్మికుల మౌలిక సదుపాయాల కోసం రూ.5 లక్షలు బడ్జెట్ కేటాయించడం హర్షణీయం. నూతన ప్రభుత్వం అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి.

- జె.వి.రమణ రాజు, గౌరవ అధ్యక్షుడు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్

అపరాధ రుసుం విధించేది..



గత మూడేళ్లుగా పారిశుధ్య కార్మికులకు ఎందుకు మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని అప్పటి కమిషనర్‌ను ప్రశ్నించగా ప్రభుత్వం వీరికి రూ.6వేలు హెల్త్ అలవెన్సు అందిస్తోందని, ఇక వీరికి ఏమీ ఇవ్వనవసరం లేదన్నారు. 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలో 279 జీవో అమలులో ఉండేది. ఆ సమయంలో కొవ్వూరు, జంగా రెడ్డి గూడెం మునిసిపాలిటీల్లో పారిశుధ్య కార్మికుల కాంట్రాక్టర్‌గా ఉన్నాను. పారి శుధ్య కార్మికులకు అవరసమైన వస్తువులు, సదుపాయాలు క్రమం తప్పకుండా ఇచ్చాం. పారిశుధ్య కార్మి కులకు డ్రెస్ కోడ్ అమలు చేశాం. కార్మికులు పని చేయడానికి, వారు అనారోగ్యం బారిన పడకుండా అవసరమైన వస్తు సామగ్రి అందించకపోతే ప్రభుత్వం మాకు అపరాధ రుసుము విధించేది.

- ఏవీ.రమణమూర్తి, కౌన్సిలర్, మాజీ పారిశుధ్య కార్మికుల కాంట్రాక్టర్

చేపల రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రామరాజు

- గౌరవాధ్యక్షుడిగా డాక్టర్ కామినేని శ్రీనివాస్

-7లో

శ్రీవారి క్షేత్రంపై అమావాస్య ఎఫెక్ట్

ద్వారకాతిరుమల, జూలై 5: చినవెంకన్న క్షేత్రానికి వచ్చే భక్తుల రద్దీపై శుక్రవారం అమావాస్య ప్రభావం కనిపించింది. ఆలయంలోని అన్ని విభాగాలు దాదాపు ఖాళీగా కన్పించాయి. శ్రీవారి క్షేత్రానికి సాధారణంగా ప్రతీ రోజూ వందలాదిగా భక్తులు తరలి వస్తారు. ఆషాఢమాసం ముందు అమావాస్య కావడంతో ఆలయానికి వందల సంఖ్యలోనే యాత్రికులు తరలివచ్చారు. దేవస్థానం, ప్రైవేటు ఫ్యాన్సీ దుకాణాలు మధ్యాహ్నం సమయానికే మూతపడ్డాయి. రానున్నది ఆషాఢమాసం కావడంతో ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య కాస్త తగ్గవచ్చని దేవాలయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.


ఖాళీగా క్యూకాంప్లెక్స్..

ఎరుపెక్కిన గోదావరి
పెరుగుతున్న నీటిమట్టం

పోలవరం, జూలై 5 : పోలవరం ప్రాజెక్టులో గోదావరి నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతుంది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు ఉప నదులు పొంగి గోదావరిలో కలుస్తుండడం వల్ల శుక్రవారం గోదావరి నీటిమట్టం పెరిగి పూర్తిగా ఎరుపు రంగులోకి మారింది. గండి పోశమ్మ ఆలయం, పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయం వద్ద నీటిమట్టం పెరిగింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 26.470 మీటర్లు, స్పిల్వే దిగువన 16.350 మీటర్లు, కాఫర్ డ్యాంకి ఎగువన 26.530 మీటర్లు, కాఫర్ డ్యాంకి దిగువన 15.330 మీటర్లు నీటిమట్టం నమోదైనట్టు ఈఈలు పి.వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు.


పట్టిసీమ శివక్షేత్రం వద్ద గోదావరి

హరివిల్లు విరిసే..
కనువిందు చేసిన ఇంద్రధనుస్సు

ద్వారకా తిరుమల, జూలై 5: ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామి వారి క్షేత్రంలో ఏడురంగుల ఇంద్రధనుస్సు చూపరులను కనువిందుచేసింది. శుక్రవారం ఉదయం నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపాడు. సాయంత్రం నుంచి వాతావరణం మారిపోయి మేఘాలు అలుముకుని ఆ తర్వాత ఒక్కసారిగా తుంపరులు కురిశాయి. అనంతరం ఆకాశంలో వేర్వేరు ప్రాంతాల్లో ఇంద్రధనుస్సు కనిపించగా పలువురు వాటిని తిలకించి పరవశించారు.


ద్వారకాతిరుమలలో హరివిల్లు

సమగ్రశిక్ష పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్ల సమస్యలు పరిష్కరించాలి

▸▸ మంత్రి లోకేశ్‌కు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు వినతి

ఏలూరు అర్బన్, జూలై 5 : రాష్ట్రవ్యాప్తంగా 2012 నుంచి జడ్పీ, మున్సిపల్ పాఠశాలల్లో సమగ్రశిక్ష ప్రాజెక్టు కింద పనిచేస్తున్న ఐదువేల మంది పార్ట్‌టైం, కాంట్రాక్టు ఇన్‌స్ట్రక్టర్లకు ఉద్యోగభద్రత కల్పించాలని ఏపీ పార్ట్‌టైం, కాంట్రాక్టు ఉపాధ్యాయుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖమంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఏలూరులో వివరాలను పత్రికలకు విడుదల చేశారు. ఇన్‌స్ట్రక్టర్లకు ఈపీఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలని మంత్రిని కోరామన్నారు. కనీస వేతనం కింద నెలకు రూ.33 వేలు ఇవ్వాలని కోరారు. ఉద్యోగ నియామక నిబంధనల్లో పార్ట్‌టైం అనేపదాన్ని తొలగించి ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్‌గా మార్చాలని అభ్యర్థించారు. భర్తీ చేయకుండా ఖాళీగా ఉంచిన ఆర్ట్, క్రాఫ్ట్ పోస్టులన్నింటిని మెగా డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో చేర్చి నింపాలని కోరామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆర్ట్, క్రాఫ్ట్ పోస్టులను రద్దుచేసి వాటిని ఎంటీఎస్-1, 2 పోస్టులుగా కన్వర్ట్ చేశారని, ఇప్పుడు వాటిని రద్దుచేసి యథాతథంగా పూర్వపు పోస్టులనే రెగ్యులర్ విధానంలో భర్తీచేయాలని డిమాండ్ చేశారు. మరణించిన కాంట్రాక్టు ఇన్‌స్ట్రక్టర్ల కుటుంబాలకు రూ.10లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరామన్నారు. మంత్రిని కలిసిన సంఘ నాయకుల్లో బాలాజీ తదితరులున్నారు.


మంత్రి లోకేశ్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న శ్రీనివాసరావు

2,516 మందికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్

నూజివీడు టౌన్, జూలై 5: ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఆర్కే వ్యాలీ, శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లలో 2024-25 విద్యా సంవత్సరంలో ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్‌లో ప్రవేశాలకై ప్రత్యేక కేటగిరీల్లో 2,516 మంది విద్యార్థులకు నూజివీడు ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తయి నట్లు అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్.అమరేంద్రకుమార్ తెలిపారు. ఎన్‌సీసీ కేటగిరీలో మొదటి ఐదురోజులకు గాను 1,141 మంది, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగం-162 మంది, క్యాప్ విభాగం-167, దివ్యాంగుల విభాగం-249, క్రీడా విభాగం-796 మంది విద్యార్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేసుకున్నారన్నారు. జనరల్ కౌన్సెలింగ్‌కు సంబంధించి క్యాంపస్‌ల వారీగా ఎంపికైన విద్యార్థుల తుది జాబితా ఈనెల 11న విడుదల చేస్తామని, ఎంపికైన విద్యార్థులు ధ్రువపత్రాల పరిశీలన, నూజివీడు, ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లలో ఈనెల 22, 23 తేదీల్లోనూ, ఒంగోలు క్యాంపస్‌కు సంబంధించి ఆర్కే వ్యాలీలో 24, 25 తేదీల్లో, శ్రీకాకుళం క్యాంపస్‌లో 26, 27 తేదీల్లో జరుగుతుందన్నారు.



రేవు పాటకు షెడ్యూల్ నిల్

నరసాపురం రూరల్, జూలై 5: మాధవాయిపాలెం సఖినేటిపల్లి రేవు పాటకు మూడో రోజు శుక్రవారం ఒక్క షెడ్యూల్ కూడా అమ్ముడుకాలేదు. ఈనెల 8న మండల పరిషత్ కార్యాలయంలో వేలం పాట జరగనుంది. పాటలో పాల్గొనాలంటే పాటదారుడు షెడ్యూల్ కొనుగోలు చేయాల్సి ఉంది. ఎవరూ ఆసక్తి చూపించలేదు. షెడ్యూల్ విక్రయాలకు ఇంకా రెండు రోజులు మాత్రమే గడువు ఉంది. ఒక్కటి కూడా కొనకపోతే పాట వాయిదా వేస్తామని ఎంపీడీవో రమణరావు తెలిపారు.

జన్మభూమి రుణం తీర్చుకుంటా : కిషోర్

పెనుమంట్ర, జూలై 5 : నా జన్మభూమిని, జన్మనిచ్చిన తల్లిదండ్రులను విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఏ స్థాయికి వెళ్లినా మర్చిపోనని జన్మభూమి రుణం తీర్చుకుంటానని ప్రవాసాంధ్రుడు ఖండవల్లి కిషోర్ అన్నారు. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి అక్కడే వ్యాపారాలు చేస్తూ స్థిరపడి మార్టేరు గ్రామానికి వచ్చిన ఎన్నారై ఖండవల్లి కిషోర్ దంపతులకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఖండవల్లి కిషోర్ చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో ఆత్మీయ సమ్మేళనం సత్తి సుబ్బన్నరెడ్డి అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు చేశారు. మిత్రుల సహాయ సహకారాలతో ట్రస్టు ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో క్రీడల పట్ల ఆసక్తి ఉండి సరైన వసతులు లేని విద్యార్థులను ఎంపిక చేసి జాతీయస్థాయిలో రాణించేలా కృషి చేయడమే ట్రస్టు లక్ష్యమన్నారు. నాలుగేళ్ల క్రితం అమెరికా మాజీ అధ్యక్షుడు జార్జి బుష్‌తో ఇంటర్వ్యూ చేయాల్సి వచ్చినప్పుడు గంటకుపైగా అనేక విషయాలు చర్చిస్తూ, మధ్యలో ఆయనే నన్ను ఇంటర్వ్యూ చేసిన విధానం, మేధాశక్తి మరువలేనిది అన్నారు. కర్రి శ్రీనివాస్ రెడ్డి, అరిగెల పెద్దిరాజు, కోనాల శ్రీనివాస్ రెడ్డి, గుడిమెట్ల లక్ష్మణ్ రెడిపాల్గొన్నారు.


ఎన్ఆర్ఐ కిషోర్ దంపతులకు సత్కారం

రక్త పింజర పాము పట్టివేత

జంగారెడ్డిగూడెం, జూలై 5 :స్థానిక లక్ష్మీ హాస్పిటల్ సమీపంలో నివాసం ఉంటున్న కూరగంటి కళ్యాణ్ ఇంటివద్ద శుక్రవారం ప్రమాద కరమైన రక్తపింజర పాము సెకండ్ ఫ్లోర్ మెట్లు ఎక్కుతుండగా కనిపించింది. అతడి కుటుంబ సభ్యులు పామును చూసి భయంతో వెంటనే స్నేక్ సేవియర్ సొసైటీ అధ్యక్షుడు చదలవాడ క్రాంతి కుమార్‌కు సమాచారమిచ్చారు. హుటాహుటిన అక్కడకు వచ్చి పామును పట్టుకుని రక్త పింజర పాము అంటారని తెలిపాడు. దాని బరువు ఐదు కేజీలని, మూడున్నర అడుగులు పొడవుందని తెలిపాడు. పట్టిన పామును సురక్షితంగా అడవిలో విడిచి పెడతానని చెప్పారు.



పెంపుడు జంతువులతో జాగ్రత్త సుమీ..

నేడు ప్రపంచ జునోసిస్ దినోత్సవం

జంతువుల నుంచి మానవులకు సంక్రమించే కొన్ని వ్యాధులున్నాయని ప్రజలకు తెలిపేందుకే ప్రపంచ జునోసిస్ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఏటా జూలై 6న ప్రపంచ జునోసిస్ దినోత్సవంగా పాటిస్తారు. బ్యాక్టీరియా, వైరస్, శిలీంధ్రాలు, పరాన్నజీవులు మానవులకు జునోటిక్ వ్యాధులను తెస్తాయి. ఎలుకలు, పౌల్ట్రీ జంతువులు, సరీసృపాలు, ఉభయచరాలు, కీటకాలతో సంబంధం ఏర్పడినప్పుడు అవి జునటిక్ వ్యాధులకు దారి తీస్తాయి. కాని సంక్రమణ సాధారణంగా దోమల కాటు ద్వారా వ్యాపిస్తుంది. కొవిడ్-19 జునోటిక్ వ్యాధికి ఒక ఉదాహరణ.. ఎందుకంటే కొవిడ్-19 కారక ఏజంట్ గబ్బిలాల నుంచి ఉద్భవించినట్టు పరిగణిస్తాం. నేడు ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

ద్వారకాతిరుమల, జూలై 5 :





జునోసిస్ దినోత్సవ చరిత్ర ఇది..

ఫ్రెంచ్ శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ జూలై 6, 1885న జునోటిక్ వ్యాధి ర్యాబిస్‌కు మొదటిసారిగా వ్యాక్సిన్‌ను విజయవంతంగా కనుగొన్నారు. పిచ్చికుక్క కాటుకు గురైన బాలుడికి టీకా వేసి పునర్జన్మ ఇచ్చిన సందర్భంగా ప్రతీ ఏటా ఈ రోజును జునోసెస్ దినోత్సవంగా పరిగణిస్తున్నారు. ఈ రోజున ప్రతీ ఏటా పెంపుడు జంతువులకు ఉచిత రేబిస్ టీకాలను వేయిస్తున్నారు.

ప్రధానంగా వ్యాపించే వ్యాధులు

జునోసిస్ వ్యాధుల్లో ముఖ్యమైనవి రేబిస్, జపనీస్ ఎన్‌సెఫలైటిస్ (మెదడు వాపు), వైరల్ హెపటైటిస్, అమ్మవారు, డెంగీ, కొక్కెర, ఆంత్రాక్స్, బ్రూసెల్లోసిస్, క్యాట్ స్క్రాచ్ డిసీజ్, లెప్టోస్పైరోసిస్, సాల్మనెల్లోసిస్, కాలిఫెల్లోసిస్, స్టెఫ్లోలోకోకస్, ట్యూబర్ క్యులోసిస్, తామర, అమీబియాసిస్, కొలి బాలంటీడియోసిస్, జియార్డియాసిస్, సార్కోసిస్టోసిస్, ప్యారసైటిక్ జ్యునోసిస్, ఫైలేరియాసిస్, నారికురుపు. స్కేబీస్ వంటివి. ఇటువంటి వ్యాధులను నివారించే పద్ధతులు ప్రజలు తెలుసుకోవాలి. వ్యాధి సరిగ్గా నిర్ధారణ జరగకుంటే అది పెద్దసంఖ్యలో ప్రజలకు సోకుతుంది. మరణానికి కూడా కారణం కావచ్చు. ఈ వ్యాధి సోకిన వారిని విస్మరించకూడదు. కాకుంటే సరైన చికిత్స పొందాలి. ఈ వ్యాధులు నీరు, ఆహారం, పర్యావరణం ద్వారా మాత్రమే కాకుండా అడవి, పెంపుడు జంతువుల ద్వారా కూడా వ్యాపిస్తాయి. పెంపుడు జంతువులను తమ ఇంటిలో ఉంచుకునే వ్యక్తులు సరైన పరిశుభ్రతను పాటించాలి. అనారోగ్యాన్ని నివారించేందుకు వాటికి క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి. సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్, ప్రివెన్షన్ నివేదికల ప్రకారం 70 శాతం అంటువ్యాధులు జంతువుల నుంచి ఉద్భవించాయి.

2024-థీమ్

జునోటిక్ వ్యాధుల వ్యాప్తిని నిరోధించడం. భవిష్యత్‌లో అంటువ్యాధులు వస్తాయేమో అనే భయాన్ని మేనేజ్ చేయడం ద్వారా జునోసిస్‌ను అడ్డుకోవడం. వ్యాధి సంసిద్ధత, ప్రతిస్పందన కోసం ఒక ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించడం.

కారణాలు ఇవే..

వాతావరణ కాలుష్యం, జీవనోపాధికి మనుషులు పలు ప్రాంతాల్లో సంచరించడం, కలుషితనీరు, ఆహారం, అనారోగ్య అలవాట్లు, వృత్తిరీత్యా పశువులు, పశుఉత్పత్తుల పరిశ్రమలో పనిచేసేవారికి సరైన అవగాహన లేకపోవడం. వ్యాధి నిర్ధారణకు సరైన సౌకర్యాలు లేకపోవడం, వ్యక్తిగత అపరిశుభ్రత, పారిశుధ్యలోపం, పెంపుడు జంతువుల పోషణలో లోపాలు తదితర కారణాల వల్ల జునోటిక్ వ్యాధులు ప్రబలుతున్నాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

ముఖ్యంగా వ్యక్తిగత, పరిసర పరిశుభ్రత పాటించాలి.
మరగకాచిన పాలను, ఉడకబెట్టిన మాంసం తినాలి.
కలుషిత నీటికి, నిల్వ ఆహారానికి దూరంగా ఉండాలి.
పశువుల కొట్టం చుట్టూ నీరునిల్వ ఉండకూడదు,
గోమార్లు, పేల నిర్మూలనకు జాగ్రత్తలు వహించాలి.
పెంపుడు జంతువులకు టీకాలు వేయించాలి. వ్యాధి సోకిన పశుపక్ష్యాదులను మందనుంచి వేరుచేయాలి

అవగాహనతో వ్యాధులను నివారించవచ్చు..



పెంపుడు జంతువులతో వాటి యజమానులు జాగ్రత్తగా ఉండాలి. జునోసిస్ వ్యాధులు చాలా ఉన్నప్పటికీ ఎక్కువ వ్యాధులతో ప్రమాదం తక్కువ. ప్రజల్లో ఆరోగ్య విజ్ఞానంపై అవగాహన అవసరం. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు ఉండాలి. రక్షిత మంచినీరు, పెంపుడు జంతువులను శాస్త్రీయ పద్ధతిలో పోషించాలి.

- డాక్టర్ అంగర సురేష్
వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, ద్వారకాతిరుమల

సమాజాన్ని మేల్కొల్పడంలో నాటికలు కీలకం

ఏలూరు రూరల్, జూలై 5: మరికొంత వినోదం, సందేశం ఒకవైపు, జీవిత సారాంశం మరోవైపు కలగలిపి ఏలూరు వైఎంహెచ్ఏ ప్రాంగణంలో జరుగుతున్న అల్లూరి సీతారామ రాజు స్మారక రాష్ట్రస్థాయి నాటిక పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. వైఎంహెచ్ఏ హేలాపురి కళాపరిషత్ సం యుక్త ఆధ్వర్యంలో నాటిక పోటీలు రెండోరోజు శుక్రవారం హేలాపురి కళాపరిషత్ అధ్యక్షుడు పెదపాటి రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాన్ని మేల్కొల్పడంలో నాటికలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు.

'రాత' నాటిక

తొలుత పోలిదాసు శ్రీనివాసరావు రచించి దర్శకత్వం వహించిన 'రాత' నాటికను వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించారు. మనిషికి కష్టం కలిగితే నా రాత ఇంతే నా రాత బాగోలేదు అంటూ ఉంటాడు. సుఖం విషయంలో మాత్రం రాతను గాలికి వదిలేస్తాడు. పొందాల్సినవి మంచిగా పొందుతాడు. తిరిగి ఇవ్వాల్సిన వాటి విషయంలో మాత్రం బాధ్యతలేకుండా ఉంటాడు. అది ఎదుట మనిషి విషయంలోనైనా, ప్రకృతి విషయంలోనైనా ఇలాంటి మనిషి నైజం వల్ల ప్రస్తుత సమాజంలో ఏం జరుగుతోంది? సమాజం ఎటు పోతోంది ? మనిషి జీవనం ఎలా సాగుతోంది? ఈ అనర్థాలకు కారణం ఎవరు? ఇది ఎవరు రాసిన రాత అనే ఇతివృత్తంతో నాటికను ప్రదర్శించారు.


రాత నాటికలో సన్నివేశం

'అజరామరం' నాటిక

అనంతరం కళావర్షిణి ద్రోణాదుల వారిచే 'అజరామరం' నాటిక కంటతడి పెట్టించింది. కీర్తిశేఖర వర్మ జమిందారి వంశానికి వారసుడు. ఉన్నత చదువులు చదివి ఊరి ప్రజల బాగోగులను చూసే ఉద్యోగం చేస్తుంటాడు. ఒకరోజు ఆలయంలో జరిగిన కార్యక్రమానికి కీర్తిశేఖర్‌వర్మ అక్కడ దేవదాసి తన కూతురికి కన్నెరికం జరిపించాలని ప్రయత్నిస్తుంటే ఎదురించి ఆ కన్యను తన సంరక్షణలో ఉంచుతాడు. కొద్దిరోజులకు సౌదామినీ మహిళతో కీర్తిశేఖర వర్మకు వివాహం జరుగుతుంది. అప్పటి నుంచి దేవదాసి కూతురైన ప్రియమణికి కీర్తిశేఖరవర్మ ఇల్లాలు సౌదామినికి ప్రేమను సమానంగా పంచుతుంటాడు. ప్రియమణితో ఉన్న సంబంధం గురించి తెలిసిన సౌదామిని ఎప్పుడూ భర్తను ప్రశ్నించలేదు కాని కాలం ప్రశ్నించేలా చేసింది. ఆ ప్రశ్నకు సమాధానం ఏమిటి అన్నదే అజరామరం నాటిక స్పష్టం చేసింది. కళాకారులు ప్రదర్శన ఆహుతులను అలరించింది. కార్యక్రమంలో సోమలింగేశ్వరరావు, ఎం.డి. ఖాజావలీ, రామాంజనేయులు సిద్ధాంతి, వరప్రసాదరావు, రాజగోపాల్ తదితరులు పర్యవేక్షించారు.

తెలుగు రాష్ట్రాలకు మేలు చేసేలా సమావేశం ఉండాలి

ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సమితి అధ్యక్షుడు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్, జూలై 5:హైదరాబాద్‌లో శనివారం జరగనున్న ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం సుహృద్భావ వాతావరణంలో జరగాలని, రెండు రాష్ట్రాలకు మేలు కలిగేలా ఉండాలని ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పట్టణంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విభజన హామీలు తెలంగాణ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రుల స్థాయిలో ఇప్పటివరకు సమావేశం జరగలేదని, గతంలో లేని విధంగా ఇద్దరు ముఖ్యమంత్రులు మంచి మిత్రులు కాబట్టి రాష్ట్రాల ప్రయోజనాలను నెరవేర్చడంలో ఒకింత తగ్గినప్పటికీ మంచి అవగాహనతో రాష్ట్ర ప్రయోజనాలను కాపాడవలసి ఉందన్నారు. జలవనరులు, విద్యుత్ అంశాలపై అంగీకారానికి రావాలని కోరారు. ఆంధ్రా ఆస్తులను తెలంగాణకి గత సీఎం జగన్ దారా దత్తం చేశారని తెలిపారు. విభజన హామీల్లో ముఖ్యంగా రూ.1.43 లక్షల కోట్ల రూపాయలు ఉమ్మడి ఆస్తులుగా ఉన్నాయని, వాటిలో 58 శాతం ఆంధ్రప్రదేశ్‌కు మిగిలివి తెలంగాణాకు చెందేలా.. ఏ సమస్య లేకుండా పరిష్కరించుకోవాలన్నారు. 1956కు ముందు తూర్పు గోదావరి జిల్లాలో ఉన్నటువంటి భద్రాచలంతో పాటు నాలుగు మండలాలను రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణలో కలిపారని, భద్రాచలం దేవస్థానానికి విరాళాలు ఇచ్చిన వారిలో 90 శాతం ఆంధ్రప్రదేశ్ వాసులే ఉన్నారనిన్నారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు పోలవరం ప్రాజెక్టుపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి మాట్లాడాలని, దుమ్ము గూడెంను ఆంధ్రాలో కలిపితే పునరావాసం సమస్య పరిష్కారం అవుతుందన్నారు. సమితి సభ్యులు డాక్టర్ కేఎస్‌పీఎన్ వర్మ, మేడికొండ శ్రీనివాస్ చౌదరి, పడాల ఆంజనేయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చలసాని శ్రీనివాస్

చేపల రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రామరాజు

▸▸ గౌరవాధ్యక్షుడిగా డాక్టర్ కామినేని శ్రీనివాస్

కైకలూరు, జూలై 5: రాష్ట్ర చేపల రైతుల సంఘం నూతన అధ్యక్షుడిగా నంబూరి వెంకట రామరాజు (తాడినాడ బాబు) ఎన్నికయ్యారు. శుక్రవారం భుజబలపట్నంలో సంఘ మాజీ అధ్యక్షుడు ముదునూరి సీతారామరాజు నివాసం వద్ద జరిగిన సమావేశం నిర్వహించారు. రాష్ట్ర చేపల రైతుల సంఘం గౌరవాధ్యక్షుడిగా కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా తాడినాడ బాబు, కార్యదర్శిగా ఏలూరుకు చెందిన పెన్మెత్స బోసురాజు, సంయుక్త కార్యదర్శిగా గుడివాడకు చెందిన దొప్పలపూడి రవికుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రామరాజు మాట్లాడుతూ ఇకపై రాష్ట్రంలో చేపలకు సంబంధించిన ఎలాంటి సమస్యనైనా ఎమ్మెల్యే కామినేనితో రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. చేపల రైతుల సంఘ నాయకులు కొండ్రెడ్డి సత్యనారాయణ, పునూకొల్లు వెంకటరమణ, ఐవీ సత్యనారాయణరాజు, కొల్లూరి సత్యనారాయణ, పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, గుర్రం శ్యాంకుమార్, గాదిరాజు భాస్కరరాజు, చదల వాడ శేషగిరిరావు, పేరిచర్ల రామరాజు, వీరమల్లు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో చేపల రైతుల సంఘ నాయకులు

మోటారు సైక్లిస్టుకు గాయాలు

ద్వార కాతిరుమల, జూలై 5: మోటారు సైకిల్‌ను నిర్లక్ష్యంగా నడిపి ముందు వెళ్తున్న మరో బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టిన వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ జి.సతీష్ తెలిపిన వివరాలివి.. ఎం.నాగులపల్లికి చెందిన వీరవల్లి ఏడుకొండలు గత నెల 28వ తేదీ రాత్రి సొంత పనిమీద భీమడోలుకు వెళ్తున్నాడు. పెట్రోల్ బంక్ వద్దకు వచ్చేసరికి భీమడోలు మండలం చినలింగపాడుకు చెందిన నంబూరి సంగీతరావు తనబైక్‌ను నిర్లక్ష్యంగా నడుపుతూ ఏడుకొండలు బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఏడుకొండలు కింద పడగా చేయి విరగడంతో ఏలూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

పోలీసు అధికారులు, సిబ్బందికి నగదు రివార్డులు

ఏలూరు క్రైం, జూలై 5 : పేకాట స్థావరంపై దాడిచేసి చాకచక్యంగా 23 మందిని అరెస్టు చేసి ఎనిమిది లక్షల 45 వేల రూపాయల నగదు సీజ్ చేసిన పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ డి. మేరీ ప్రశాంతి నగదు రివార్డులను ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం అందించారు. చేబ్రోలు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉంగుటూరు మండలం కంసాలిగుంట గ్రామంలో 2023 జనవరి 16వ తేదీన పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి 23 మందిని అరెస్టు చేసి నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదే ఏడాది డిసెంబరు 29న కోర్టులో హాజరుపర్చగా నేరం అంగీకరించారు. ఒకొక్కరికి మూడు వేల రూపాయల జరిమానా కోర్టు విధించింది. ఈ కేసులో కోర్టు పోలీసులను అభినందిస్తూ వారికి నగదు రివార్డుగా లక్షా 65 వేల రూపాయలను ఇచ్చింది. ఆ సొమ్ములను ఆమె పోలీస్ సిబ్బందికి అందించారు. అప్పటి చేబ్రోలు ఎస్ఐ స్వామి వారి సిబ్బందికి అందించి అభినందించారు.


నగదు రివార్డును అందించిన ఎస్పీ మేరీ ప్రశాంతి

మగపిల్లాడిని కనలేదని భార్యపై భర్త దాడి..

ముసునూరు, జూలై 5: భార్యపై భర్త దాడిచేసిన ఘటనపై ముసునూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ పి.వాసు తెలిపిన వివరాలివి.. మండలంలోని అక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన నల్లగోపు రంగరాజు కొద్ది నెలలుగా మద్యానికి బానిపై భార్య నాగలక్ష్మిని చిత్రహింసలకు గురిచేస్తున్నాడు. ముగ్గురు ఆడపిల్లలను కన్నావు, మగపిల్లవాడు కావాలంటూ ప్రతి రోజు మాటలతో నరకం చూపిస్తున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం మద్యం తాగి వచ్చిన రంగరాజు భార్యతో గొడవ పడి కర్రతో దాడిచేయగా ఆమె తలకు బలమైన గాయమైంది. బాధితురాలు నూజివీడు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆగస్టు 6,7,8 తేదీల్లో కేవీపీఎస్ శిక్షణ తరగతులు

భీమవరం అర్బన్, జూలై 5 : కేవీపీఎస్ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు భీమవరంలో ఆగస్టు 6,7,8వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.మాల్యాద్రి తెలిపారు. శుక్రవారం సంఘం కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన కోసం నిరంతరం కేవీపీఎస్ పోరాడుతుందన్నారు. రాష్ట్రంలో నిర్వహించే టెట్, డీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్న ఎస్సీఎస్టీబీసీ విద్యార్థులకు అన్ని జిల్లాకేంద్రాల్లో అంబేడ్కర్ పూలే పేర్లతో శిక్షణ సెంటర్‌లు ఏర్పాటు చేయలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ సభ్యులు దిగుపాటి రాజగోపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు బలరాం మాట్లాడుతూ వెంప దళిత పేటలో దాడి చేసిన వారిని తక్షణం అరెస్టు చేయాలని, దర్యాప్తు పేరుతో కాలయాపన చేయడం సబబు కాదన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు, జిల్లా అధ్యక్షుడు బత్తుల విజయ్, నాయకులు చిన్నం నాగేశ్వరరావు, మాదాసి గోపి, గొల్ల ఏడుకొండలు, పి.శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ప్రేమికుడు పెళ్లికి నిరాకరించాడని..

▸▸ యువతి ఆత్మహత్యాయత్నం ▸▸ ఆసుపత్రిలో చికిత్స

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 5: ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం తాడేపల్లిగూడెంలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివి.. తాడేపల్లిగూడెంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న నిడదవోలుకు చెందిన బాదంపూడి మమత ఆసుపత్రి యాజమాన్యం కేటాయించిన క్వార్టర్స్‌లో ఉంటోంది, ఆ యువతి కపిలేశ్వరానికి చెందిన తాతపూడి రాజేష్‌ను రెండేళ్లుగా ప్రేమిస్తుంది. ఈ వ్యవహారంలో రాజేష్ మమతతో పెళ్లి నిరాకరించడంతో మనస్తాపానికి గురై క్వార్టర్స్‌లోనే రాజేష్‌తో వీడియో కాల్ చేసి ఆత్మహత్యకు పాల్పడింది, వెంటనే రాజేష్ ఆమె స్నేహితులను అప్రమత్తం చేసి అడ్డుకునేందుకు వెళ్లగా అప్పటికే ఉరివేసుకుంది. వెంటనే ఆమెను అక్కడి నుంచి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించి, మెరుగైన చికిత్స కోసం మరో ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కామవరపుకోట, జూలై 5 :రావికంపాడు గ్రామానికి చెందిన ఆవుల ఇస్సాకు (35) అనే వ్యక్తి జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్టు తడికలపూడి ఎస్ఐ జయబాబు తెలిపారు. గురువారం రాత్రి ఇస్సాకు, నాగేశ్వరరావు అనే వ్యక్తులు రామాలయం వద్ద ఘర్షణ పడడంతో ఇస్సాకుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఇస్సాకును చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని ఎస్ఐ వివరించారు. తడికలపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని ఒకరు..

ఏలూరు క్రైం, జూలై 5 : రైలు పట్టాలపై ఒక మృతదేహం ఉన్నట్లు ఏలూరు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ నంబూరి ఆదినాయణకు సమాచారం అందడంతో సిబ్బందితో శుక్రవారం ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఏలూరు పవర్‌పేటకు చెందిన ఎండమూరి అప్పారావు(41) ఏలూరు గన్‌బజార్ రైలు బ్రిడ్జి కింద శుక్రవారం మధ్యాహ్నం రైలు పట్టాలపై రెండు ముక్కలై ఉన్నాడు. ప్రమాదవశాత్తు జారిపడ్డాడా, ఆత్మహత్య చేసుకున్నాడా అని తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న ఏలూరు రైల్వే హెచ్‌సీ, తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రెండు లారీలు ఢీ.. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

జంగారెడ్డిగూడెం, జూలై 5 : ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు బలంగా ఢీకొన్న ఘటన జంగారెడ్డిగూడెం పట్టణంలోని ఎస్ఆర్ పెట్రోల్ బంక్ వద్ద బైపాస్‌రోడ్డుపై గురువారం అర్ధరాత్రి జరిగింది. ఈ ఘటనలో ఒక లారీ డ్రైవరు తలకు, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివి.. వైజాగ్ నుంచి గోవాకు బూడిద లోడుతో వెళ్తున్న లారీని ఎస్.కె.సంసుద్దీన్ నడుపుతున్నాడు. ఖమ్మం నుంచి వైజాగ్ వెళ్తున్న గ్రానైట్ లారీను ఎ.పుల్లయ్య నడుపుతున్నాడు. ఈ రెండు లారీలు స్థానిక ఎస్ఆర్ పెట్రోల్ బంకు వద్దకు చేరుకునే సరికి గ్రానైట్ లారీ బూడిద లోడుతో వెళ్తున్న లారీని బలంగా ఢీ కొట్టింది. లారీ వెనుక ఉన్న భారీ గ్రానైట్ రాళ్ళు లారీ క్యాబిన్ పైన పడడంతో లారీ డ్రైవర్ పుల్లయ్య క్యాబి న్‌లో చిక్కుకున్నాడు. స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో డ్రైవరు పుల్లయ్యను బయటకు తీసి స్థానిక ఏరియా ఆసుపత్రికి, అనంత రం మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ తరలించారు. బూడిద లారీ డ్రైవరు సంసుద్దీన్, క్లీనర్ ఎం.చిరంజీవిలకు ఎటువంటి ప్రమాదం జరగక పోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఎస్ఐ జ్యోతిబసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాద స్థలంలో లారీలు..
లారీ డ్రైవర్ పుల్లయ్య

ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి


మొక్క నాటుతున్న ఎమ్మెల్యే

ఏలూరు కార్పొరేషన్, జూలై 5: ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎస్ఆర్ఎన్ వద్ద మునిసిపల్ ఎంప్లాయిస్ యూనియన్ వార్షికోత్సవంలో శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రజలకు సేవలు అందించడంలో నిర్లక్ష్యం చేయవద్దని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే మొక్కలు నాటారు. కార్యక్రమంలో చోడే వెంకటరత్నం, మునిసిపల్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, ప్రతినిధులు ఎ.అప్పలరాజు, పీవీ.రమణ, బి.నారాయణరావు, ఎస్ఎంవీ.సుబ్బారావు, ఎస్.శ్రీనివాస్, సీహెచ్.హరినాథ్, డి.వెంకటేశ్వరరావు, వెంకటేశ్, ఎస్.కె.ఆలీ, సయ్యద్ బాజీ, శ్రీనివాస్, అప్పారావు, దుర్గారావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు సత్వరం పరిష్కరించాలి : చింతమనేని


సమస్యలు వింటున్న ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగి, జూలై 5: ప్రజల సమస్యలు తక్షణం పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆదేశించారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజా సమస్యలను స్వీకరించి సంబంధిత అధికారులకు ఫోన్‌చేసి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ప్రభాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనులు చేస్తున్నామని చెప్పారు. వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్యంపై అధికారులు మరింత శ్రద్ధ పెట్టాలని, పారిశుధ్యం, తాగునీటి నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని ప్రభాకర్ హెచ్చరించారు. ఉప్పలపాటి శ్రీరామ్‌ప్రసాద్, తాతా సత్యనారాయణ, బొప్పన సుధాకర్, మాగంటి నారాయణప్రసాద్, లావేటి శ్రీనివాసరావు, నంబూరి నాగరాజు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన పాలన అందించాలి : ఎమ్మెల్యే రోషన్


కార్యదర్శులతో మాట్లాడుతున్న రోషన్

కామవరపుకోట, జూలై 5: గ్రామ కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం గ్రామ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, మంచినీటి సౌకర్యాన్ని మెరుగుపర్చాలని, వీధి దీపాలు నిరంతరం వెలిగేలా చూడాలని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే బాధ్యత తీసుకోవాలని చెప్పారు. సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. కోనేరు వెంకట సుబ్బారావు, ఘంటా సుధీర్‌బాబు, మద్దిపోటి నాగేశ్వర రాంబాబు, కార్యదర్శుల సంఘ ప్రతినిధులు జీడీవీ.శ్రీనివాసరావు, విజయ్, జీవీ.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో అఖండ విజయం సాధించిన నేపథ్యంలో ఆడమిల్లిలో వేడుకలు నిర్వహించారు. నాయకుల సమక్షంలో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ కేక్ కట్‌చేసి వేడుక చేశారు. సర్పంచ్ గూడపాటి కేశవరావు, బలుసు సాయి, యలమర్తి రాంబాబు, షేక్ వలీ, ఒంటెద్దు ఏసువరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్లలో పూడిక తొలగించాలి : ఎమ్మెల్యే ధర్మరాజు


ఇరిగేషన్ అధికారులతో ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు, జూలై 5: వర్షాకాలం పంటలు ముంపు బారిన పడకుండా నియోజకవర్గంలో డ్రెయిన్లలో పూడిక తొలగించాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కోరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని డ్రెయిన్ల పరిస్థితిపై శుక్రవారం ఆయన అధికారులతో సమీక్షించారు. డ్రెయిన్లలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని ఇరిగేషన్, డ్రైన్స్ ఈఈని ఆదేశించారు.

పీఎంపీల సేవలు ఉపయోగించుకోవాలి

పీఎంపీల సేవలు ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కోరారు. పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కైకరంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురు వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు, జడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, గ్రామ సర్పంచ్ సలగాల గోపి, చింతల శ్రీనివాస్, ఎంపీటీసీ చెన్ను సత్యవాణి, పీఎంపీలు కొచ్చర్ల కోట శ్రీనివాసరావు పాల్గొన్నారు. సుమారు 200 మంది రోగులను పరీక్షించారు.

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలి


మాట్లాడుతున్న సీపీఐ నేత డేగా ప్రభాకర్

ఏలూరు కార్పొరేషన్, జూలై 5: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఆర్ఆర్‌పేట స్ఫూర్తి భవన్‌లో కురెళ్ళ వరప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ప్రభాకర్, జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య బండి వెంకటేశ్వరరావు పలు సమస్యలపై చర్చలు జరిపారు. దేశంలో, రాష్ట్రంలో అనేక హామీలు ఇచ్చి అధికారం పొందిన ప్రభుత్వాలు ప్రజా సంక్షేమం, అభివృద్ధిని సమానంగా చూడాలని చెప్పారు. సీపీఐ నాయకులు ఉప్పులూరి హేమశంకర్, మావూరి విజయ్, ఆళ్ళగర్ల లక్ష్మీ ఇందిర, కొల్లూరి సుధారాణి, ఎం.ఎ.హకీం, రషీద్‌బాజీ, ఉప్పులూరి లక్ష్మీ, భవాని, జోజి మేరి, తులసి, కాటూరి శ్రీధర్, వెంకటపతి పాల్గొన్నారు.

పోలవరంలో ఫ్రైడే డ్రైడే అవగాహన కార్యక్రమాలు


కుండల్లో నీరు వంపుతున్న సిబ్బంది

పోలవరం, జూలై 5: పోలవరం పంచాయతీ బెస్తావీధి, కమ్మరగూడెం గ్రామాల్లో శుక్రవారం వైద్య సిబ్బంది డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. నివాసాల వద్ద మురికి నీరు నిల్వ ఉన్న తొట్టెలు, కుండలు, టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాలలో నీళ్లు తొలగించారు. సికిల్ సెల్ ఎనీమియాపై గ్రామస్థులకు అవగాహన కల్పించి మందులు పంపిణీ చేశారు. ఏఎన్ఎం పోశమ్మ, ఆశ వర్కర్లు గోకా అరుణ కుమారి, బీరా రత్నాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న సిబ్బంది

నిడమర్రు, జూలై 5: ఉపాధి హామీ పనులు నిబద్ధతతో నిర్వహించాలని డ్వామా పీడీ ఎ.రాము సూచించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. మండలంలో రూ.6.69 కోట్ల నిధులు, మెటీరియల్ ద్వారా రూ.2.59 కోట్లు ఖర్చు చేసినట్లు టెక్నికల్ అసిస్టెంట్ టి.సతీష్ నివేదించారు. బావాయిపాలెం, పెదనిండ్రకొలను, తోకలపల్లి గ్రామాలలో మస్తర్ కొట్టివేతలపై వివరణ కోరారు. కొన్ని గ్రామాల్లో 6 రోజుల పని దినాలకు 5 రోజులు మాత్రమే నమోదు చేయడంతో నష్టపోయిన పనిదినాల వేతనాలను ఆయా ఫీల్డ్ అసిస్టెంట్లు నుంచి వసూలు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. నిడమర్రులో ఎం.బుక్ నమోదులో తప్పులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తోకలపల్లి, పత్తేపురంలో ప్లాంటేషన్ కార్యక్రమంలో జరిగిన అవకతవకలు పరిశీలించి తిరిగి మొక్కలు నాటి చూపాలని సూచించారు. డీవీవో ఏవీ.విజయలక్ష్మి, డీఆర్‌డీఏ ఏపీడీ నాగరాజు, ఏలూరు క్లస్టర్ ఏపీడీ సుధాకర్, సూర్యచక్రం, ఎంపీడీవో శివరామకృష్ణయ్య తదితరుల పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాకు సత్కారం


శ్రీవారి చిత్రపటాన్ని అందిస్తున్న నేతలు

ద్వారకాతిరుమల, జూలై 5: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్‌ను టీడీపీ నేతలు శుక్రవారం కలసి సత్కరించారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఆయనను ఇమ్మడి రత్నాజీ, కూరాకుల బుజ్జి యాదవ్, గువ్వల మావుళ్లు తదితరులు కలసి శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నట్లు నేతలు తెలిపారు. ద్వారకాతిరుమల స్వామి దర్శనం చేసుకోవాలని కోరామని వివరించారు.



ఏలూరులో డయేరియా అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


లింగపాలెం మండలం కె.గోకవరం పీహెచ్‌సీలో రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

అతిసార.. ఆపుదాం

అతిసార లక్షణాలు
- వాంతులు, విరేచనాలు, నీరసం.
- అన్నం రుచించకపోవడం, వికారం.
- తరచూ నీళ్ల విరేచనాలు.
- అతిసారం వ్యాధివ్యాప్తికి కారణాలు.
- కలుషిత నీటి ద్వారా వ్యాప్తి.
- వ్యక్తిగత పరిశుభ్రత లేకపోవడం.
- ఆహార లోపంతో పిల్లలకు డయేరియా.
- నిల్వ ఉంచిన ఆహారం తినడం.

అతిసార నిరోధించే చర్యలు
- సురక్షితమైన తాగునీరు వాడాలి
- పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- సబ్బుతో చేతులు కడుక్కోవాలి.
- కాచి చల్లార్చిన నీటిని తాగాలి.
- మరుగుదొడ్లు పరిశుభ్రం చేసుకోవాలి.
- చంటి బిడ్డలకు తల్లిపాలు ఇవ్వాలి.

అతిసార - చికిత్స
- మందులు సక్రమంగా వాడాలి.
- ఉప్పు, చక్కెర కలిపిన నీరు తాగాలి.
- జింక్‌మాత్రలు వాడాలి.
- జావ, పోషకాహారం తీసుకోవాలి.

ఏలూరు టూటౌన్, జూలై 5: డయేరియా (అతిసార).. ఈ పేరు వింటేనే ప్రజలు భయపడుతున్నారు. వాతావరణ మార్పు, వర్షాలు, నీటి కాలుష్యంతో డయేరియా ప్రబలే అవకాశం ఉందని అధికారులు ముందస్తుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రోజుకు మూడు కంటే ఎక్కువ సార్లు నీళ్ల విరేచనాలు డయేరియాగా భావించాలని వైద్యులు సూచిస్తున్నారు. ఐదేళ్ల లోపు పిల్లలకు ఎక్కువగా డయేరియా బారినపడే అవకాశం ఉంది. ఈ నెల 1 నుంచి స్టాప్ డయేరియా పేరిట ఆగస్టు 31 వరకు 60 రోజుల పాటు అవగాహన కార్యక్రమాలకు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు.

అంటువ్యాధులపై అవగాహన ర్యాలీ

ఏలూరు అర్బన్: వర్షాకాలంలో దోమలు, ఈగలు వృద్ధి చెందడం ద్వారా ప్రాణాంతక మలేరియా, అతిసార, డెంగీ, కామెర్ల బారిన పడే ప్రమాదం ఉందని అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు హెచ్చరించారు. లంకపేటలో శుక్రవారం నిర్వహించిన ర్యాలీలో అంటువ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కలిగించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా కీటకాలను నిరోధించవచ్చన్నారు. వైద్య సిబ్బంది శ్రీనివాసరావు, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ఫీవర్ సర్వే..

లింగపాలెం: ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించాలని, ఎవరికైనా జ్వరం, వాంతులు, విరోచనాలు ఉంటే వెంటనే దగ్గరలో ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లాలని డాక్టర్ కృష్ణకిషోర్ అన్నారు. కె.గోకవరం పీహెచ్‌సీ పరిధిలో శుక్రవారం ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించారు. వర్షాకాలంలో పలు వ్యాధులు ప్రబలుతాయని, ప్రజలను అప్రమత్తం చేయాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు గ్రామాల్లో ప్రతిరోజూ ఇంటింటికి సర్వే నిర్వహించాలని, ఎటువంటి అనారోగ్య సమస్యలున్నా వారికి వైద్యసహాయం అందించాలన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురుగు నిల్వకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యసిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకుంటున్నాం

నగరంలో డయేరియా సోకకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నాం. డ్రెయినేజీల్లో పూడిక తొలగిస్తున్నాం. సచివాలయ, శానిటరి సెక్రటరీలు, నగరపాలక సంస్థ పారిశుధ్య సిబ్బందితో ప్రతీరోజు 50 ఇళ్లను సందర్శిస్తున్నాం. ప్రతీ ఇంటికి ఒఆర్ఎస్, జింక్ ట్యాబ్లెట్లు ఇస్తున్నాం. అర్బన్ హెల్త్ సెంటర్స్‌లో మందులు అందుబాటులో ఉంచాం. ప్రజలకు సరఫరా చేసే తాగునీటిపై ప్రతీ రోజు 400 టెస్టులు చేస్తున్నాం. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు నమోదు కాలేదు.

ఎస్.వెంకటకృష్ణ, నగర పాలక సంస్థ కమిషనర్, ఏలూరు

అప్రమత్తంగా ఉండాలి

సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పోలవరంలో పలు ప్రాంతాల్లో వాంతులు విరోచనాలు డయేరియా కేసులు నమోదైన నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలి, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి, రక్షిత నీరు తీసుకోవాలి, బయటి ఆహార పదార్థాలను తీసుకోరాదు. భోజనానికి ముందు, మల మూత్ర విసర్జన తర్వాత చేతులు సబ్బుతో శుభ్రపరుచుకోవాలి. వాంతులు విరోచనాలైతే వైద్యులను సంప్రదించాలి.

టి.కృష్ణరాజు, సీహెచ్‌సీ వైద్యాధికారి, పోలవరం

కస్తూరిబా పాఠశాల విద్యార్థి నాయకుడి ఎన్నిక


పోలింగ్ నిర్వహిస్తున్న ఎన్నికల సిబ్బంది

ఏలూరు అర్బన్, జూలై 5: నగరంలోని కస్తూరిబా మున్సిపల్ బాలికోన్నత పాఠశాల విద్యార్థి సంఘ ఎన్నికలు శుక్రవారం జరిగాయి. సాధారణ ఎన్నికల ప్రక్రియ మాదిరి నామినేషన్ల స్వీకరణ, పోలింగ్ బూత్‌లో బ్యాలెట్ పేపర్ పద్ధతిన ఓటింగ్, తదుపరి కౌంటింగ్, విజేతల ప్రకటన చేశారు. హెచ్ఎం సునీత మాట్లాడుతూ ఎస్పీఎల్ (స్టూడెంట్ పీపుల్ లీడర్) ఎన్నిక ద్వారా సాధారణ ఎన్నికలపై అవగాహన కల్పించామన్నారు. పదిరోజులక్రితమే ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేశామన్నారు. నూతనంగా ఎన్నికైన ఎస్పీఎల్‌తో ప్రమాణస్వీకారం చేయించారు.

పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసు : డీఎస్పీ

పెదవేగి, జూలై 5: పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని, హైకోర్టు ఆదేశాలను అనుసరించి ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్‌ను ధరించి వాహనాలను నడపాలని డీఎస్పీ జి.లక్ష్మయ్య చెప్పారు. పెదవేగి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. ద్విచక్ర వాహన ప్రమాదాల్లో ఎక్కువ మరణాలు తలకు సంబంధించిన గాయాల కారణంగా సంభవిస్తున్నాయన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని కోర్టు ఇచ్చిన ఆదేశాలను శనివారం నుంచే అమలు చేస్తున్నామని ఆయన చెప్పారు. ద్విచక్ర వాహనం నడిపే ఒక్కరూ హెల్మెట్ ధరించాల్సిందేనని స్పష్టం చేశారు. హెల్మెట్‌ధారణపై అవగాహన కల్పించాలని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల విభాగాధిపతులకు నోటీసులు పంపిస్తున్నామని తెలిపారు. కనీస వయస్సులేని వారు ద్విచక్రవాహనాలను నడిపితే ఇకపై జరిమానాతోపాటు వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని, వాహనాన్నికూడా సీజ్ చేస్తామని డీఎస్పీ హెచ్చరించారు.

సెయింట్ థెరిస్సా కళాశాల వ్యవస్థాపక దినోత్సవం

ఏలూరు అర్బన్, జూలై 5: ఏలూరులో మహిళలకోసం 1953లో ప్రత్యేకంగా పాఠశాల, కళాశాలను స్థాపించేందుకు సహాయ, సహకారాలు అందజేసిన విద్యాదాత చింతలపాటి వరప్రసాద మూర్తిరాజు, సత్యవతీ దేవి దంపతులు ధన్యులని సీహెచ్ఎస్‌డి సెయింట్ థెరిస్సా మహిళాకళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ కొనియాడారు. కళాశాల వ్యవస్థాపక దినోత్సవం శుక్రవారం జరిగింది. సిస్టర్ మెర్సీ మాట్లాడుతూ మహిళలకు నాణ్యమైన విద్యనందించాలని మదర్ క్లైమెంజా చేసిన ఆలోచనలకు మూర్తిరాజు దంపతులు కార్యరూపమిచ్చారని వివరించారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ మరియా క్రిస్టియా, సిస్టర్ సుశీల, డాక్టర్ జ్యోతికుమారి తదితరులు పాల్గొన్నారు.

రేపు 'నాట్స్' ఉచిత వైద్యశిబిరం

ఏలూరు అర్బన్, జూలై 5: ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్), ఏలూరు ఆయుష్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం వట్లూరు హైస్కూలులో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కాశీనాథ్ జాస్తి శుక్రవారం తెలిపారు. వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. వివరాలకు కొమ్మన మోహన్‌ను 98481 56756లో సంప్రదించాలని 'నాట్స్' ఛైర్మన్ పిన్నమనేని ప్రశాంత్, ప్రెసిడెంట్ పాములేటి మదన్, ధూళిపాళ్ళ బానుప్రకాష్ కోరారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్చాలి


గాలాయగూడెంలో విద్యార్థులతో ర్యాలీ

దెందులూరు, జూలై 5: బడి ఈడు పిల్లందరూ తప్పనిసరిగా చదువుకోవాలని, వారికోసం ప్రభుత్వం ఉచిత విద్య పుస్తకాలు, భోజనం వసతులు కల్పిస్తుందని ఎంపీడీవో శ్రీలత అన్నారు. మండలంలోని గాలాయగూడెంలో ఎంఈవోలు ప్రసాద్, అన్నమ్మతో కలసి ఎంపీడీవో బడికి పోదాం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. చదువు ద్వారానే మంచి భవిష్యత్ ఉంటుందని వివరించారు. అనంతరం గాలాయగూడెం పరిధిలో బడికి వెళ్లకుండా ఉన్న ముగ్గురుని గుర్తించి తల్లిదండ్రులతో మాట్లాడి వారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాల దుకాణాలపై దాడులు


తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

జంగారెడ్డిగూడెం, జూలై 5: నకిలీ విత్తనాలు, నాసిరకం పురుగు మందులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర స్థాయి విజిలెన్స్ అధికారులు జగదీశ్వర రెడ్డి, నాగరాజు హెచ్చరించారు. పట్టణంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలపై శుక్రవారం విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. స్వర్ణాంధ్ర రైతు సేవా కేంద్రంలో అనుమతులు లేని సూక్ష్మ పోషకాల 137 కేజీలు ప్యాకెట్లు గుర్తించి నిర్వాహకులపై 6ఎ కేసు నమోదు చేశారు. వీటి విలువ రూ.51,022 ఉంటుందని జగదీశ్వర రెడ్డి తెలిపారు. సూర్య సీడ్స్ విత్తనాల దుకాణంలో అనుమతి లేని రూ.3.58 లక్షల విలువ చేసే 234 జెండ విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేశామన్నారు. కేఆర్‌పురం వ్యవసాయ సంచాలకులు పి.జి బుజ్జిబాబు, ఏవో కేవీఎస్.పోశారావు ఉన్నారు.

విత్తన తయారీ కేంద్రాల తనిఖీ

పెదపాడు, జూలై 5: వసంతవాడలోని అన్నపూర్ణ సీడ్స్‌ను ఏడీఏ బి.విజయప్రసాద్ శుక్రవారం తనిఖీ చేశారు. విత్తన తయారీ కేంద్రానికి అనుమతులు, సీడ్ జెర్మినేషన్ నిర్వహణ, స్టాక్, స్టాక్‌కు సంబంధించి నిల్వలను పరిశీలించారు. విత్తన తయారీ, నాణ్యతలో లోటుపాట్లు ఉండరాదని, నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించాలని నిర్వాహకులకు సూచించారు. తనిఖీల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ యుజే విల్సన్, వ్యవసాయాధికారి వాసపల్లి ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి

దెందులూరు, జూలై 5: విద్యార్థులు చిన్ననాటి నుంచి దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఒత్తిడి, మనోవేదన లేకుండా క్రమశిక్షణతో ముందుకు సాగాలని ప్రభుత్వ మానసిక వైద్య నిపుణులు వంశీకృష్ణ అన్నారు. గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ నతానియేల్ ఆధ్వర్యంలో వ్యాయామ విద్యార్థులకు మానసిక స్థితిపై శుక్రవారం అవగహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యులు సాయికుమార్, వంశీ పిల్లల ఆలోచనలపై అవగహన కలిగించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వ్యాయామ విద్యార్థులు పాల్గొన్నారు

కైకరం హైస్కూలులో వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ

ఉంగుటూరు, జూలై 5: విద్యార్థులకు లక్ష్య సాధన, ఆత్మ విశ్వాసంతో శక్తివంతంగా మారడానికి వ్యక్తిత్వ వికాసం శిక్షణ ఇస్తునట్లు సైకాలజిస్టు ప్రత్యూష సుబ్బారావు తెలిపారు. కైకరం హైస్కూలులో విద్యార్థులకు శుక్రవారం వ్యక్తిత్వం వికాసంపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు చూడడం, మాట్లాడడం, వినడం, ఆలోచించడం, పనిచేయడం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం గుళ్ళ ప్రసాదరావు, మానవత జిల్లా ఎడ్యుకేషన్ కమిటీ ఛైర్మన్ ఎ.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయం పొందాలి

పెదపాడు, జులై 5: అవసరమైన సందర్భంలో ఉచిత న్యాయ సాయాన్ని పొందాలని రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. అప్పనవీడులోని ఆశాజ్యోతి మానసిక వికలాంగుల పాఠశాలలో శుక్రవారం విభిన్న ప్రతిభావంతులతో మాట్లాడారు. అక్కడ వారికి అందుతున్న సేవలపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి న్యాయ సహాయం కోరినా ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మరీదు మాధవీలత పాల్గొన్నారు.

వృద్ధులకు పింఛన్లు పంపిణీ

ఏలూరు రూరల్, జూలై 5: పేదలకు సేవచేయడంలో సంతృప్తి ఉందని కొప్పుల వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బీమవరపు పాపారావు అన్నారు. నిరుపేద వృద్ధులు, దివ్యాంగులకు ప్రతినెల సంఘం ఆధ్వర్యంలో రూ.500 చొప్పున పింఛన్ అందజేస్తున్నారు. సంఘ భవనంలో శుక్రవారం సుమారు 20 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే బీమవరపు సురేష్ పుట్టినరోజు సందర్భంగా ఆయన అందించిన ఆర్థికసాయంతో చీరలు, స్వీటు బాక్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మరడాని అచ్యుతరావు, ఎ.తిరుపతిరావు, కర్రి సత్యనారాయణ, కార్పొరేటర్ బీమవరపు హేమసుందరి, పడాల వెంకటేశ్వరరావు, పూడి ఉమామహేశ్వరరావు, సమ్మంగి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.


ఎస్ఆర్.నగర్ కూడలి వద్ద నిరసన తెలియచేస్తున్న స్థానికులు

పుట్రేల రోడ్డు అభివృద్ధి చేయాలి

టి.నరసాపురం, జూలై 5: అధ్వానంగా ఉన్న పుట్రేల రోడ్డు అభివృద్ధి చేయాలని సీపీఎం మండల కమిటీ సభ్యులు అనుమోలు మురళి డిమాండ్ చేశారు. రోడ్డు నిర్మాణం కోరుతూ ఏఎస్ఆర్ నగర్ కూడలి వద్ద శుక్రవారం ఆందోళన నిర్వహించారు. కొన్నేళ్లుగా పుట్రేల రోడ్డు అభివృద్ధి లేక ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. బండివారిగూడెం సమీపంలో పుట్రేల ఊరగుంట చెరువు వద్ద కల్వర్టు నిర్మాణానికి రోడ్డుకు ఇరువైపులా గోతులు తవ్వి వదిలి వేయడంతో ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. దీనితో ఆర్టీసీ బస్సు సౌకర్యం కూడా రద్దు చేశారని, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయంపై పంచాయతీరాజ్ (ప్రాజెక్టు) ఏఈ అంకిరెడ్డిని వివరణ కోరగా కూలీల కొరతవల్ల పనులు ఆగాయని, రెండురోజుల్లో పనులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బాణాల రామారావు, బరగడ కుమారి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో బుల్లితెర నటి సుహాసిని



ద్వారకాతిరుమల, జూలై 5: చినవెంకన్న ఆలయాన్ని బుల్లితెర నటి సుహాసిని శుక్రవారం ఉదయం సందర్శించారు. ఆలయ ఆవరణలో ప్రదక్షిణ అనంతరం బంగారువాకిలి మీదుగా లోనికి వెళ్లి స్వామి అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పండితుల నుంచి వేదాశీర్వచనం పొందారు. అధికారులు ప్రసాదాలను అందించారు. ఆమెను గుర్తించిన ఆలయంలోని భక్తులు పలువురు ఫొటోలు దిగేందుకు ఆసక్తి కనబరిచారు.

అంబికాదేవికి రాహుకాల శ్రీచక్ర కుంకుమార్చన


అంబికాదేవి అమ్మవారు

ఏలూరుకార్పొరేషన్, జూలై 5: సత్రంపాడు అంబికాదేవి ఆలయంలో శుక్ర వారం భక్తులు రాహుకాల శ్రీచక్ర కుంకుమార్చన చేశారు. ఆలయ అర్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయంలో ఈనెల 6 నుంచి 15 వరకు వారాహి నవరాత్రిమహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు అర్చకులు రాఘవేంద్రశర్మ తెలిపారు. నగరంలో అమ్మవారి ఆలయాల వద్ద మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. బావిశెట్టివారిపేట కనకదుర్గాంబ, సత్రంపాడు సౌభాగ్యలక్ష్మీదేవి, రాజ్యలక్ష్మి, బాలత్రిపుర సుందరీదేవి, మహిషాసుర మర్థిని, నూకాలమ్మ, గంగానమ్మ అమ్మవార్ల సన్నిధిలో ఆషాడ అమావాస్య సందర్భంగా పూజలు, అభిషేకాలతో హోరెత్తాయి.

పవరుపేట స్టేషన్ రోడ్డులోని ధన్వంతరి వైద్యభగవానుని ఆలయం వద్ద భక్తులు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు రూరల్ :** శనివారపుపేట ఎంపీయూపీ ఉర్దుపాఠశాలలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి బుజ్జి అందజేసిన నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్ళు లంకపల్లి మాణిక్యాలరావు అందజేశారు. కేతినీడి జయప్రకాష్, డాక్టర్ కాలేష, సులేమాన్, మెహబూబాషా, షఫీ, పాఠశాల హెచ్ఎమ్ వహీదాబేగం తదితరులు పాల్గొన్నారు.
- **కామవరపుకోట :**ఆడమిల్లిలోని మందా సమేత శనీశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు స్వామివారికి తైలాభిషేకాలు నిర్వహించి దోష నివారణ పూజలు చేశారు. కంచి కామాక్షిసమేత ఏకాంబరేశ్వరస్వామి, భద్రకాళీ సహిత వీరభద్రస్వామి, ధర్మలింగేశ్వరస్వామి ఆలయాల వద్ద భక్తులు అమావాస్య పూజలతో ఆరాధించారు.
- **పెదపాడు :** ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబీస్ వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు పశువైద్యాధికారి సీహెచ్ వాణిసంధ్యశ్రీ తెలిపారు.
- వట్లూరులో కౌలు రైతులకు కౌలుకార్డుల కోసం గ్రామ రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని గ్రామ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ తెలిపారు. 2024-25 ఖరీఫ్, రబీకి సంబంధించి కౌలు కార్డులను అందజేయడం జరుగుతుందన్నారు.
- **టి.నరసాపురం :** ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఈనెల 7న ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ పోలవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ లంకా జయబాబు కోరారు. గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ చేయాలని ఆయన పిలుపునిచ్చారు.
- **భీమడోలు :** జూనోసిస్ డే సందర్భంగా పశు వైద్యశాలలో శనివారం కుక్కలకు రాబిస్ నిరోధక వ్యాక్సినేషన్ ఉచితంగా వేస్తామని వైద్యుడు సాయిరమేష్ తెలిపారు. భీమడోలు, ద్వారకాతిరుమల, ఉంగుటూరు, నిడమర్రు మండలాల పరిధిలోని పశువైద్యశాలల వద్ద ప్రభుత్వం ఉచిత వ్యాధి వ్యాక్సినేషన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.
- **పెదవేగి :** మండల పరిషత్ సమావేశం ఎంపీపీ తాతా రమ్య అధ్యక్షతన శనివారం జరుగుతుందని ఎంపీడీవో వెంకటరమణ తెలిపారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ హాజరవుతారని, అధికారులు తమ తమ శాఖలకు సంబంధించిన అన్నివివరాలతో హాజరుకావాలన్నారు.
- విజయరాయిలో ఈడ్పుగంటి నాగభూషణం(సుందరయ్య) జ్ఞాపకార్థం టీడీపీ ఆధ్వర్యంలో మాతృదేవోభవ సేవాట్రస్టు సహకారంతో నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 520మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. 17మంది విద్యార్థులను మెరుగైన వైద్యానికి ప్రతిపాదించారు. మాతృదేవోభవ సేవా ట్రస్టు సభ్యులు కూచిపూడి సత్యనారాయణ, వేమా హరినారాయణ, అడుసుమిల్లి నిర్మల, పండరినాథ్, పాఠశాల హెచ్ఎం ఎంవీ.రమణ, పెదర్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


డిగ్రీ కళాశాల భవనం అసంపూర్తి నిర్మాణం పరిశీలిస్తున్న నాయకులు


పీవైఎల్ సమావేశంలో మాట్లాడుతున్న పోతురెడ్డి

ఆస్పత్రి, డిగ్రీ కళాశాల భవన నిర్మాణాలు పూర్తిచేయాలి

బుట్టాయగూడెం, జులై 5: మండలంలో ఆస్పత్రి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణాలను పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు మంతెన సీతారాం డిమాండ్ చేశారు. శుక్రవారం బృందం అల్లికాలువ వద్ద నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన ఆసుపత్రిని, డిగ్రీ కాలేజి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం సీతారాం విలేకరులతో మాట్లాడారు. డిగ్రీ కాలేజి నిర్మాణం చేపట్టి ఐదేళ్లు గడిచినా పనులు పూర్తి కాలేదన్నారు. గత ప్రభుత్వం, ఐటీడీఏ అధికారుల నిర్లక్ష్యం కారణంగా డిగ్రీ కాలేజి భవన నిర్మాణం నిలిచిపోయిందన్నారు. అసంపూర్తి భవనంలో మద్యం సేవిస్తూ ఓపెన్ బార్‌గా వాడుకుంటున్నారన్నారు. అల్లికాలువ వద్ద రూ.50తో నిర్మించ తలపెట్టిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి భవనం అసంపూర్తిగా నిలిచిపోయిందన్నారు. గిరిజనులకు ఉపయోగపడే డిగ్రీ కాలేజి, ఆసుపత్రి భవన నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించి పూర్తిచేయాలని కోరారు. హాస్టల్ భవనాలను కూడా నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తెల్లం రామకృష్ణ, పోలోజు నాగేశ్వరావు, తెల్లం దుర్గారావు, చూంద్ర బుల్లెమ్మ, అన్నిక వెంకటస్వామి, తాతి రాంబాబు, పూసం దుర్గారావు, రాజన్న, సోయం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు మెరుగైన వైద్య సేవలందించాలి

ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీ గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు కల్పించి, నాణ్యమైన మందులు అందించాలని పీవైఎల్ డివిజన్ నాయకులు కెచ్చెల పోతురెడ్డి, గురుగుంట్ల ప్రసాద్‌రెడ్డి, తగరం బాబురావు డిమాండ్ చేశారు. మంగయ్యపాలెంలో పోతురెడ్డి అధ్యక్షతన డివిజన్ కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. గిరిజన గ్రామాలకు సరైన రోడ్డుమార్గం, విద్యుత్ సదుపాయం లేదని, ఆదివాసీలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అసంతృప్తిగా నిలిచిపోయిన వంద పడకల ఆసుపత్రి నిర్మాణం వెంటనే పూర్తిచేయాలన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, జీవో నెంబరు 3 యధావిధిగా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన పట్టెన్నపాలెం బ్రిడ్జి పనులను పూర్తిచేయాలని కోరారు. ఈ నెల 10న ఐటీడీఏ వద్ద పీవైఎల్ ధర్నా, ర్యాలీ కార్యక్రమాలను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.నాగేశ్వరావు, కె.నాగార్జున, కె.నడిపిరాజు, జి.లక్ష్మీనారాయణ, ఎన్.ముక్కారెడ్డి, జి.బాబురావు, మురళి, రామరాజు, రాము, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న చేపల రైతుల సంఘం

చేపల రైతుల సంఘం.. రాష్ట్ర అధ్యక్షుడిగా తాడినాడ బాబు

గౌరవాధ్యక్షుడిగా డాక్టర్ కామినేని శ్రీనివాస్

కైకలూరు, జూలై 5: రాష్ట్ర చేపల రైతుల సంఘం నూతన అధ్యక్షుడిగా నంబూరి వెంకట రామరాజు (తాడినాడ బాబు) ఎన్నికయ్యారు. శుక్రవారం భుజబలపట్నంలో సంఘ మాజీ అధ్యక్షుడు ముదునూరి సీతారామరాజు ఇంటి వద్ద జరిగిన సమావేశంలో రాష్ట్ర చేపల రైతుల సంఘం గౌరవాధ్యక్షుడిగా కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా తాడినాడ బాబు, కార్యదర్శిగా ఏలూరుకు చెందిన పెన్మెత్స బోసురాజు, సంయుక్త కార్యదర్శిగా గుడివాడకు చెందిన దొప్పలపూడి రవికుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రామరాజు మాట్లాడుతూ ఇకపై రాష్ట్రంలో చేపలకు సంబంధించిన ఎలాంటి సమస్యనైనా ఎమ్మెల్యే కామినేని ద్వారా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు. గతంలో అధ్యక్షుడిగా పనిచేసిన ముదునూరి సీతారామరాజు వయస్సు రీత్యా పదవి నుంచి తప్పుకున్నారని తెలిపారు. నూతన సంఘం ద్వారా పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. చేపల రైతుల సంఘ నాయకులు కొండ్రెడ్డి సత్యనారాయణ, పునూకొల్లు వెంకటరమణ, ఐవీ సత్యనారాయణరాజు, కొల్లూరి సత్యనారాయణ, పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, గుర్రం శ్యాంకుమార్, గాదిరాజు భాస్కరరాజు, చదలవాడ శేషగిరిరావు, పేరిచర్ల రామరాజు, వీరమల్లు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు పెంపుడు కుక్కలకు ఉచిత టీకాలు

కలిదిండి, జూలై 5 : ప్రపంచ జూనోసిస్ డేను పురస్కరించుకుని కలిదిండి పశు వైద్యశాల వద్ద శనివారం పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలను ఉచితంగా వేస్తున్నట్లు మండల పశు వైద్యాధికారి ప్రహర్ష ప్రకటనలో తెలిపారు. అలాగే జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు వ్యాపించే వ్యాధులపై అవగాహన కార్యక్రమం ఉంటుందన్నారు.

మండవల్లి: ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా మండవల్లి పశువైద్యశాల వద్ద పెంపుడు జంతువులకు ఉచితంగా టీకాలు వేస్తున్నట్టు పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ వరప్రసాద్ తెలిపారు. యజమానులు తమ పెంపుడు కుక్కలను పశువైద్యశాలకు తీసుకువచ్చి టీకాలను ఉచితంగా వేయించుకోవాలని కోరారు.

నేడు ఉపాధి పనులపై ప్రజా వేదిక

ముదినేపల్లి, జూలై 5 : 2023-24 సంవత్సరంలో ముదినేపల్లి మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులు, పెన్షన్ల పంపిణీ తదితర అంశాలకు సంబంధించి గ్రామ స్థాయిలో జరిగిన సామాజిక తనిఖీలపై శనివారం మండల స్థాయి ప్రజావేదిక నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎన్. మురళీ గంగాధరరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ, ఇతర అధికారులు పాల్గొంటారని తెలిపారు.

11 నుంచి యోగా శిక్షణ తరగతులు

కైకలూరు, జూలై 5: లోకుమూడి దత్తాశ్రమంలో ఈ నెల 11 నుండి 13 వరకు యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు ట్రస్ట్ అధ్యక్షుడు గురజాడ ఉదయశంకర్ తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 8 గంటల వరకు మైసూరు దత్తక్రియ యోగా అంతర్జాతీయ కేంద్రంచే ఈ శిక్షణా తరగతులు జరుగుతాయన్నారు. ప్రాణాయామం, ఆసనాలు, ధ్యానం, వ్యాయమాలు మొదలైన వాటిపై శిక్షణ ఇస్తారని, ఆసక్తి కల్గిన వారంతా పాల్గొనాలని కోరారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు

ముదినేపల్లి, జూలై 5 : ముదినేపల్లిలోని ఎస్‌పిఏఎం ఐటీఐ కళాశాలలో ప్రవేశానికి రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ కూనపరెడ్డి సత్యనారాయణ తెలిపారు. ఈ కళాశాలలో ఎలక్ట్రీషియన్, డీజిల్ మెకానిక్, ఫిట్టర్ ట్రేడ్‌లలో ప్రవేశాలు ఉన్నాయని తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ఈ నెల 24వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 25న సర్టిఫికెట్ల పరిశీలన, 29న కౌన్సెలింగ్ జరుగుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

పోలీసు అధికారులు, సిబ్బందికి నగదు రివార్డులు

ఏలూరు క్రైం, జూలై 5 : పేకాట స్థావరంపై దాడిచేసి చాక చక్యంగా 23 మందిని అరెస్టు చేసి ఎనిమిది లక్షల 45 వేల రూపాయల నగదు సీజ్ చేసిన పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ డి. మేరీ ప్రశాంతి నగదు రివార్డులను ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం అందించారు. చేబ్రోలు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉంగుటూరు మండలం కంసాలిగుంట గ్రామంలో 2023 జనవరి 16వ తేదీన పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి 23 మందిని అరెస్టు చేసి నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదే ఏడాది డిసెంబరు 29న కోర్టులో హాజరుపర్చగా నేరం అంగీకరించారు. ఒకొక్కరికి మూడు వేల రూపాయల జరిమానా కోర్టు విధించింది. ఈ కేసులో కోర్టు పోలీసులను అభినందిస్తూ వారికి నగదు రివార్డుగా లక్షా 65 వేల రూపాయలను ఇచ్చింది. ఆ సొమ్ములను ఆమె పోలీస్ సిబ్బందికి అందించారు. అప్పటి చేబ్రోలు ఎస్‌ఐ స్వామి వారి సిబ్బందికి అందించి అభినందించారు.

క్రైం సమాచారం

కత్తితో దాడి ఘటనలో మహిళ మృతి

ముదినేపల్లి, జులై 5 : ముదినేపల్లి మండలం చిగురుకోట గ్రామంలో నడకదారిలో మురుగునీటి విషయమై ఈ నెల 3న కత్తులతో దాడి చేసిన ఘటనలో తీవ్ర గాయాలకు గురై అపస్మారక స్థితిలో ఉన్న పరసాదేవి (32) అనే మహిళ శుక్రవారం మరణించింది. ఈ ఘటనలో పరసా వెంకట బాలాజీ, అతని భార్య దేవిపై బాలాజీ తమ్ముడు సురేష్, అతని భార్య అనిత కత్తితో దాడి చేసిన విషయం విదితమే. విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ దేవి శుక్రవారం మరణించిందని ఎస్‌ఐ వెంకట్ కుమార్ తెలిపారు. ఆమె భర్త బాలాజీ గుడివాడలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.


దేవి మృతదేహం

తొలి కేసు.. తొలి మరణం

నూతన క్రిమినల్ చట్టాలు అమలులోకి వచ్చిన అనంతరం ముదినేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన తొలి కేసు ఇదే. తొలి మరణం కూడా ఈ కేసుతోనే చోటు చేసుకుంది.

లారీ డ్రైవర్‌కు జైలు, జరిమానా

నూజివీడు టౌన్, జూలై 5: నిర్లక్ష్యంగా వాహనం నడిపి ఒకరి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి జైలు, జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు 2020 అక్టోబర్ 2న సీతానగరం గ్రామానికి చెందిన బాణావతు రమేష్, త్రిమూర్తులు మోటారు సైకిల్‌పై విస్సన్నపేట నుంచి వస్తుండగా, ఎదురుగా వస్తున్న లారీ అతివేగంగా వీరి మోటారు సైకిల్‌ను ఢీకొంది. దీంతో మోటారు సైకిల్ నడుపుతున్న బాణావతు రమేష్ తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. రమేష్ మృతికి కారణమైన కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లాకు చెందిన లారీడ్రైవర్ కడ్డే ఉమేష్‌కు విచారణ అనంతరం నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి 15 రోజుల జైలు శిక్ష, రూ.600ల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

భార్యపై కర్రతో దాడి.. భర్తపై కేసు

మగపిల్లవాడ్ని కనలేదని వేధింపులు

ముసునూరు, జూలై 5: భార్యపై భర్త దాడిచేసిన ఘటనపై ముసునూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ పి.వాసు వివరాల ప్రకారం మండలంలోని అక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన నల్లగోపు రంగరాజు కొద్ది నెలలుగా మద్యానికి బానిసై భార్య నాగలక్ష్మిని చిత్రహింసలకు గురిచేస్తున్నాడు. ముగ్గురు ఆడపిల్లలను కన్నావు, మగపిల్లవాడు కావాలంటూ ప్రతి రోజు సూటిపోటు మాటలతో నరకం చూపిస్తున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం మద్యం తాగి వచ్చిన రంగరాజు భార్యతో గొడవ పడి కర్రతో దాడిచేయగా నాగలక్ష్మి తలకు బలమైన గాయమైంది. బాధితురాలు నూజివీడు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు రంగరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముదినేపల్లి మండలంలో విద్యుత్ బకాయిలు..

రూ. 5 కోట్లు

ఆర్థిక సంఘం నిధుల్లేక పేరుకుపోయిన బిల్లులు



ముదినేపల్లి, జూలై 5 : గ్రామ పంచాయతీల విద్యుత్ బిల్లుల బకాయిలు భారీగా పేరుకుపోయాయి. పంచాయతీల్లో నిధులు లేకపోవటం, ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిధుల వినియోగానికి పంచాయతీలకు అవకాశం లేకపోవటంతో వీధిదీపాలు, రక్షిత నీటి పథకం విద్యుత్ బిల్లులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో పడిపోయాయి. ముదినేపల్లి మండలంలోని 32 పంచాయతీల విద్యుత్ బిల్లుల బకాయిలు సుమారు రూ.5 కోట్లకు చేరాయి. ప్రభుత్వం నుంచి విడుదలయ్యే ఆర్థిక సంఘం నిధుల నుంచి ఏడాదికి ఒక సారి చెల్లించే విద్యుత్ బిల్లుల మొత్తం బకాయిలపై వడ్డీకే సరిపోతోంది. అసలు సొమ్ము అలాగే ఉండిపోయింది. ఐదేళ్లలో ప్రభుత్వం పంచాయతీల ఆర్థిక సంఘం నిధులను మళ్లించటంతో మండలంలోని గ్రామ పంచాయతీల విద్యుత్ బిల్లులు డిమాండ్ మరింత పెరిగింది. మండలంలోని 32 గ్రామ పంచాయతీల్లో ఈ ఏడాది జూన్ నెలాఖరుకు వీధి దీపాల సర్వీసులకు సంబంధించి రూ.2.26 కోట్లు, నీటి పథకాలకు వినియోగించే సర్వీసులకు సంబంధించి రూ.2.74 కోట్లు ఏపీసీపీడీసీఎల్‌కు బకాయిలు చెల్లించాల్సి ఉంది. వాస్తవానికి పంచాయతీలకు వచ్చే ఆదాయం నుంచి 30 శాతం విద్యుత్ బిల్లులు చెల్లించాలన్నది ప్రభుత్వ ఉత్తర్వులు. అయితే పంచాయతీకు వచ్చే ఇంటి పన్నులు, ఇతర పన్నుల రూపేణా వచ్చే ఆదాయం పారిశుధ్య పనులు నిర్వహణ, స్టేషనరీ ఇతర ఖర్చులకే సరిపోతున్నది. ఆర్థిక సంఘం నిధులు గత అయిదేళ్లలో పంచాయతీలకే చేరలేదు. దీంతో విద్యుత్ బిల్లులు పేరుకుపోయాయి.

రహదారుల అభివృద్ధే లక్ష్యం : కామినేని


ఎమ్మెల్యే కామినేనిని సత్కరిస్తున్న నియోజకవర్గ ముస్లింలు

కలిదిండి, జులై 5 : రహదారుల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం గుర్వాయిపాలెంలో లంక గ్రామాల ప్రధాన రహదారి మరమ్మతులను ప్రారంభించి మాట్లాడుతూ గుర్వాయిపాలెం - పెదలంక డబుల్ రోడ్డు నిర్మాణానికి సెంట్రల్ రోడ్స్ ఫండ్ (సీఆర్‌ఎఫ్) కింద రూ.70 కోట్లు మంజూరు అంచనాలు రూపొందించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. రహదారుల వెంబడి ఉన్న చెత్తకుప్పలను తక్షణమే తొలగించాలని అధికారులను ఆదేశించారు. టీడీపీ మండల అధ్యక్షుడు జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్లు వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, తాడినాడ బాబు, మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, డీసీ మాజీ చైర్మన్లు ముద్దం భోగేశ్వరరావు, సారిక వెంకటేశ్వరరావు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మంతెన సుబ్బరాజు, గుర్వాయిపాలెం సర్పంచ్ బత్తిన ఉమామహేశ్వరరావు, ఆర్‌అండ్‌బీ ఏఈఈ అరవింద్, ఎంపీడీవో దినతేజ్ పాల్గొన్నారు. అనంతరం కలిదిండిలో టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు అధ్యక్షతన కూటమి నాయకులతో సమావేశం నిర్వహించి సమస్యలడిగి తెలుసుకున్నారు.

ముస్లింల సమస్యలు పరిష్కరిస్తా

ముదినేపల్లి: కైకలూరు నియోజకవర్గంలోని ముస్లింల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం రాత్రి ముదినేపల్లిలో కైకలూరు నియోజకవర్గ ముస్లింలు ఆత్మీయ సమావేశం నిర్వహించి కామినేనిని సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముదినేపల్లిలో ఈద్గా, కలిదిండిలో షాదిఖానా నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. ముస్లింల ఏరియాల్లో శ్మశాన వాటికల అభివృద్ధి, ప్రహారీ గోడల నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. టీడీపీ నాయకుడు మహ్మద్ జాని, ముస్లిం సంఘాల నాయకులు అహ్మద్, మురుల్లా, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ చేయరూ : కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల వినతి

కైకలూరు: ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిపై పని చేస్తున్నామని తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని స్టాఫ్ నర్సులు ఎమ్మెల్యే కామినేనిని కోరారు. శుక్రవారం వరహాపట్నంలోని ఆయన నివాసంలో కలిదిండి, సీతనపల్లి, దేవపూ డి, మూలలంక, పీహెచ్‌సీల్లో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు తమ ఉద్యోగాల క్రమబద్ధీకరణతో పాటు జీతాలను పెంచాలని వినతిపత్రం ఇవ్వగా. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని కామినేని అన్నారు. స్టాఫ్ నర్సులు వెంకటలక్ష్మి, బ్రిజిత, రేణుక, సీత తదితరులు పాల్గొన్నారు.

డెంగీ కేసు వెలుగుచూసినా పారిశుధ్యం పట్టదేం?

అధికారులపై డీఎల్‌పీవో ఆగ్రహం



ముసునూరు, జూలై 5: ముసునూరులో ఎనిమిదేళ్ళ బాలుడికి డెంగీ నిర్ధారణ కావడంతో నూజివీడు డివిజనల్ పంచాయితీ అధికారిణి సుందరి సగరుల కాలనీలో పారిశుధ్యాన్ని శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాలనీలో పారిశుధ్యం అధ్వానంగా ఉండటంతో పంచాయతీ అధికారులు, సిబ్బందిపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కాలనీలో బాలుడికి డెంగీ వచ్చిందని తెలిసిన తరువాత కూడా పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోకుండా ఏం చేస్తున్నారని ఆమె ప్రశ్నించారు. వెంటనే సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మీయా, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది పారి శుధ్యాన్ని మెరుగుపరిచి, దోమల మందు పిచికారీ చేసి, బ్లీచింగ్ చల్లారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని ఈవోపీ ఆర్డీ శ్రీనివాసరావును ఆదేశించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిపై ఆమె కుటుంబీ కులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి కేటాయించిన స్థలంలో ఆక్రమణ ను డీఎల్‌పీవో పరిశీలించారు. జిల్లా పంచాయితీరాజ్ అధికారి ఆదేశాల మేరకు ఈ స్థలాన్ని పరిశీలించడం జరిగిందని, దీనిపై సమగ్ర నివేదికను డీపీవోకు అందజేస్తామని తెలిపారు.

ముళ్ళచెట్ల తొలగింపు



చాట్రాయి, జూలై 5: నరసింహారావుపాలెం-నరసాపురం గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రహదారిలో ముళ్ళకంప పెరిగి రోడ్డుపైకి చొచ్చుకు వచ్చి ప్రమాదకరంగా మారటంతో శుక్రవారం పంచాయతీ ఆధ్వర్యంలో ఎక్స్ కవేటర్‌తో ముళ్ళకంప తొలగించారు. నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళ నుంచి రోడ్లకు ఇరువైపులా పెరుగుతున్న ముళ్ళకంపను ఆర్‌అండ్‌బీ శాఖ తొలగించకపోవటంతో రోడ్డు మూసుకుపోయి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహనచోదకులు, ప్రజల క్షేమం కోసం ముళ్ళకంప తొలగింపు చేపట్టినట్లు చెప్పారు. మాజీ సర్పంచ్ గార్లపాటి మారేష్, స్థానిక నాయకులు కట్టా నాగ దుర్గారావు, వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు

చాట్రాయి, జూలై 5: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు పనులు చేపట్టకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని నూజివీడు ఎమ్మెల్యే, మంత్రి కొలుసు పార్థసారథి హెచ్చరించటంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. శుక్రవారం మండలంలోని పోలవరం, చిన్నంపేటలలో గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో చెత్త కుప్పలు తొలిగించి, వీధుల్లో బ్లీచింగ్ చల్లించారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని, వేడి ఆహార పదార్థాలు తినాలని, దోమతెరలు వాడాలని జ్వర లక్షణాలు కన్పిస్తే అశ్రద్ధ చేయకుండా పీహెచ్‌సీకి వచ్చి చికిత్స పొందాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నిషాక్ అలీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

7న జగన్నాథ స్వామి రథయాత్ర



ముదినేపల్లి, జులై 5 : మండలంలోని వడాలి గ్రామంలో ఈ నెల 7న సుభద్ర, బలరామ సహిత జగన్నాథస్వామి రథయాత్రను దేవదాయ శాఖ నిర్వహించనుంది. పూరీ జగన్నాథుని రథయాత్ర జరగనున్న సందర్భంగా ప్రతి ఏటా వడాలి జగన్నాథస్వామి దేవస్థానం రథయాత్రను నిర్వహించటం ఆనవాయితీ. ఈ రథయాత్రను 7న ఉదయం ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ప్రారంభిస్తారు. వడాలి దేవస్థానం నుంచి ముదినేపల్లి, అక్కడి నుంచి సింగరాయపాలెం బావాజీ మఠం వరకు ఈ రథయాత్రను నిర్వహిస్తామని దేవస్థానం ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

రథయాత్ర విశిష్టత..

ప్రతి ఏటా ఆషాఢ విదియ రోజున జరిగే రథయాత్రకు ఒక విశిష్టత ఉంది. పూరిలోని జగన్నాథస్వామి ఆలయంలో మూల పీఠంపై జగన్నాథుడితోపాటు బలభద్ర, సుభద్ర విగ్రహాలు ఉంటాయి. వడాలి దేవస్థానంలో కూడా అదేవిధంగా విగ్రహాలు ఉంటాయి. అందుకే వడాలి దేవస్థానంలో జరిగే జగన్నాథుడి రథయాత్రలో పాల్గొంటే పూరి వెళ్లినట్లుగానే భక్తులు భావిస్తారు. జగన్నాథుడి రథాన్ని లాగితే తమ దోషాలు తొలగుతాయన్నది భక్తుల విశ్వాసం. ఏ దేవస్థానంలోనైనా ఉత్సవ విగ్రహాలనే ఊరేగిస్తారు. జగన్నాథ స్వామి దేవస్థానంలో మాత్రం మూల విరాట్‌లనే రథంపై ఊరేగించటం విశేషం

7న ఇస్కాన్ ఆధ్వర్యంలో..

కైకలూరు: కైకలూరులో ఈ నెల 7న మొట్టమొదటిసారిగా ఇస్కాన్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఆ రోజు మధ్యాహ్నం ఒంటి గంటకు కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి ఆలయం వద్ద నుంచి రథయాత్ర ప్రారంభమవు తుందని భక్తులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఇస్కాన్ టెంపుల్ కమిటీ సభ్యులు కోరారు.

మంత్రి దృష్టికి ప్రజా సమస్యలు



చాట్రాయి, జూలై 5: మండలంలోని జనార్దనవరం గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్థానిక టీడీపీ నాయకులు శుక్రవారం గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకువెళ్ళారు. ఇళ్ళ స్థలాలు, రహదారులు తదితర సమస్యలు మంత్రికి వివరించగా సానుకూలంగా స్పందించారని నాయకులు చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో తెలుగు మహిళా నాయకురాలు మాదాసు చంద్రకళ, టీడీపీ నాయకులు కలకొండ భాస్కరరావు, చిన్న పుల్లయ్య, వంగల సుబ్బారావు తదితరులు ఉన్నారు.

సరిపడినంతే మట్టి నిల్వ

ఫిర్యాదుపై ఎన్‌హెచ్ పనులను పరిశీలించిన విజిలెన్స్



కైకలూరు, జూలై 5: 165వ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఫ్లైఓవర్ నిర్మాణ పనులను విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. శుక్రవారం కైకలూరు మండలం గోనెపాడు గ్రామంలో నిర్మాణం జరిగే బైపాస్ పై ఓవర్ నిర్మాణంలో నిబంధనలకు మించి మట్టి నిల్వలు చేసినట్లుగా అందిన ఫిర్యాదు మేరకు తనిఖీలు నిర్వహించారు. ఫ్లైఓవర్ నిర్మాణంలో రైల్వే ట్రాక్‌కు రెండు వైపులా భారీఎత్తున మట్టి నిల్వలు పెట్టారు. అవసరానికి మించి మట్టి నిల్వ చేశారని విజిలెన్స్ ఉన్నతాధికారులు ఫిర్యాదు చేసినట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా విజిలెన్స్ ఏజీ పి. శ్రీధర్ తెలిపారు. అయితే మట్టి ఫ్లైఓవర్ నిర్మాణానికే నిల్వ చేశారని అదనంగా లేదని ఆయన వెల్లడించారు. ఈ తనిఖీలో విజిలెన్సు ఏఈలు ఎం. రూపేష్‌వర్మ, అరుణ్‌బాబు, ఉమ్మడి కృష్ణాజిల్లా మైనింగ్ ఇన్‌స్పెక్టర్ వి విజయలక్ష్మి, ఆర్‌ఐ ప్రసాద్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

భోజనం తనిఖీ



ముసునూరు, జూలై 5: విద్యార్థులకు రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని మండల విద్యాశాఖాధికారి బి.వి. సుబ్బారావు అన్నారు. శుక్రవారం గోపవరం జడ్పీ పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం మెనూ రికార్డులను పరిశీలించి, ఆహార నాణ్యతను తనిఖీ చేశారు. అవకతవకలకు పాల్పడితే వంట ఏజన్సీలను రద్దు చేస్తామని హెచ్చరించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచి, ఉత్తమ బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

పౌష్టికాహారంతోనే వ్యాధి నిరోధక శక్తి

ముసునూరు, జూలై 5: పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా ఇచ్చినప్పుడే పిల్లల్లో వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందని అంగన్‌వాడీ కార్యకర్త పి.రాజకుమారి అన్నారు. శుక్రవారం చింతలవల్లి అంగన్‌వాడీ కేంద్రంతో పాటు మండల వ్యాప్తంగా ఉన్న అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీస్కూల్ చిన్నారుల తల్లిదండ్రులకు చిన్నారుల ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. పౌష్టికాహారం కిట్లను అందజేశారు. చేతుల శుభ్రం చేసుకునే పద్ధతులను చేసి చూపించారు.

డ్రైన్లలో సిల్ట్ తొలగింపు

నూజివీడు టౌన్, జూలై 5: నూజివీడు పట్టణంలో డ్రైన్‌లలో పూడికతీత కార్యక్రమానికి మున్సిపల్ అధికారులు శ్రీకారం చుట్టారు. పట్టణం మొత్తాన్ని పలు విభాగాలుగా విభజించి గత కొంతకాలంగా సిల్ట్‌తో పూడిపోయిన డ్రైన్‌లలో సిల్ట్ తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. నూజివీడు మున్సిపల్ సమావేశంలో ఎక్స్‌అఫీషియో మెంబర్‌గా పాల్గొన్న నూజివీడు ఎమ్మెల్యే, రాష్ట్రమంత్రి కొలుసు పార్థసారథి ఆదేశాల మేరకు వార్డుల్లో ఆరోగ్యకర వాతావరణం కల్పించేందుకు సిల్ట్ తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు.

పంచాయతీల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు

ముదినేపల్లి, జులై 5 : స్టాప్ డయేరియాలో భాగంగా పంచాయతీల్లో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను అధికారులు నిర్వహించారు. రోడ్ల వెంబడి చెత్తకుప్పల తొలగింపు, పక్కా డ్రైన్లు బాగు చేత, దోమల నివారణ చర్యలను పంచాయతీల సిబ్బంది నిర్వహించారు. ఈవోపీఆర్డీ డి.లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో పంచాయతీల కార్యదర్శులు, సిబ్బంది పలు గ్రామాల్లో పల్లపు ప్రాంతాల్లో నిలిచిన మురుగునీటిని తొలగించారు. మంచినీటి చెరువులను పరిశుభ్రం చేశారు. సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, కార్యదర్శి జి.రమేష్ ఆధ్వర్యంలో ముదినేపల్లి పంచాయతీ ఏరియాలో డ్రైన్ల తవ్వకం పనులను నిర్వహించి మురుగునీటి పారుదల చర్యలు చేపట్టారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించినట్లు కూడా ఈవోపీఆర్డీ తెలిపారు.


చాట్రాయిలో రహదారి నిర్మిస్తున్న దృశ్యం

రహదారి నిర్మాణానికి నడుం బిగించిన రైతులు

చాట్రాయి, జూలై 5: తమ వ్యవసాయ భూములకు వెళ్ళటానికి రోడ్డు లేక నిత్యం అవస్థలు పడుతున్న రైతులు ఐక్యంగా రహదారి నిర్మాణానికి నడుం బిగించారు. చాట్రాయి-నరసాపురం ఆర్‌అండ్‌బీ రహదారిలో సబ్‌స్టేషన్ నుంచి ఫారెస్ట్ వరకు ఉన్న వ్యవసాయ భూములకు వెళ్ళే రహదారి ఆక్రమణలు గురి కావటంతో, ఇటీవల రైతులు తహసీల్దార్ మహ్మద్ ముక్సూద్ అలీకి ఆక్రమణలు తొలగించాలని అర్జీ సమర్పించగా వెంటనే స్పందించిన తహసీల్దార్ సర్వే చేయించి ఆక్రమణలు తొలిగించారు. దీంతో జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి, ఆయకట్టు రైతు మందపాటి బసవారెడ్డి ఆధ్వర్యంలో రైతులు స్వచ్ఛందంగా నిధులు సమకూర్చటంతో 2 ఎక్స్‌కవేటర్లు, 2 డోజర్లతో సైడ్ కందకాలు తీసి 8 అడుగుల వెడల్పుతో 1200 మీటర్లు పొడవు గల రహదారి నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా బసవారెడ్డి మాట్లాడుతూ ఈ రోడ్డు అధ్వానంగా మారటంతో సుమారు 200 ఎకరాలలోని రైతులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారని, రైతులే రహదారి నిర్మించుకున్నందున, ఈ రహదారిపై గ్రావెల్ వేసి పటిష్టంగా నిర్మించటానికి పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించాలని కోరామని చెప్పారు.

2,516 మందికి సర్టిఫికెట్ వెరిఫికేషన్



నూజివీడు టౌన్, జూలై 5: ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఆర్కే వ్యాలీ, శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లలో 2024-25 విద్యా సంవత్సరంలో ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్‌లో ప్రవేశాలకై ప్రత్యేక కేటగిరిల్లో 2,516 మంది విద్యార్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి అయినట్లు ఆర్జీయూకేటీ అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్. అమరేంద్రకుమార్ తెలిపారు. ఎన్‌సీసీ కేటగిరిలో మొదటి ఐదు రోజులకు గాను 1141 మంది, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో 162 మంది, క్యాప్ విభాగంలో 167, దివ్యాంగుల విభాగంలో 249, క్రీడా విభాగంలో 796 మంది విద్యార్థులు తమ సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేసుకున్నారన్నారు. కాగా జనరల్ కౌన్సెలింగ్‌కు సంబంధించి క్యాంపస్‌ల వారీగా ఎంపికైన విద్యార్థుల తుది జాబితా ఈ నెల 11న విడుదల చేయటం జరుగుతుందని, ఎంపికైన విద్యార్థులు ధ్రువ పత్రాల పరిశీలన, నూజివీడు, ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లలో జూలై 22, 23 తేదీల్లోనూ, ఒంగోలు క్యాంపస్‌కు సంబం ధించి ఆర్కే వ్యాలీలో 24, 25 తేదీల్లో, శ్రీకాకుళం క్యాంపస్‌లో 26, 27 తేదీల్లో జరుగుతుందన్నారు.

లోకేశ్‌ను కలసిన ముద్దరబోయిన



నూజివీడు, జూలై 5: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు శుక్రవారం కలసి శుభాకాంక్షలు తెలిపారు. యువగళం పాదయాత్ర నిర్వహించి, ప్రజా సమస్యలు తెలుసుకున్న లోకేశ్ సీఎం చంద్రబాబుతో కలసి ప్రజా సమస్యల పరిష్కారం దిశగా అడుగులు వేయాలన్నారు. గత రాక్షస పాలనను ముగింపు పలికిన రాష్ట్రప్రజలు తెలుగుదేశానికి అఖండ మెజార్టీని అందించారని, ప్రజా సంక్షేమ పాలనను అందించటంలో టీడీపీ ప్రభుత్వం ముందుంటుందన్నారు.

పెండింగ్ డీఏ విడుదల చేయాలి

నూజివీడు టౌన్, జూలై 5: పెండింగ్ డీఏను వెంటనే మంజూరు చేయాల్సిందిగా ఏపీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బండారు సత్యనారాయణ కోరారు. నూజివీడులో శుక్రవారం సంఘ అధ్యక్షుడు బీఎం సింగ్ అధ్యక్షతన జరిగిన ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ హెల్త్ స్కీమ్‌ను వెంటనే అమలు చేయాలని, ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బిల్లులను రీయింబర్స్ చేసి వెంటనే ఖాతాలకు జమ చేయాలని కోరారు. సభ్యులు పలగాని పిచ్చియ్య, పర్వతనేని మాధవరావు, స్టాన్లీ ప్రభాకర్, రిచర్డ్, ఈమని శేషయ్య, ఆర్.సాంబయ్య, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో హెచ్‌ఎం విజయకుమార్ మృతి



ముసునూరు, జూలై 5: మండలంలోని వేల్పుచర్ల ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న పిల్లాజెట్టి విజయకుమార్(53) శుక్రవారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందారు. విజయకుమార్‌కు యాక్సిడెంట్ అవడంతో గత పది రోజుల నుంచి మెడికల్ లీవ్‌లో రామన్నగూడెంలో ఉన్నారు. ఈ క్రమంలో ఆయనకు గుండెపోటు రావడంతో నూజివీడు అమెరికన్ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. ఈయన యూటీఎఫ్ మండల కార్యదర్శిగా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. యూటీఎఫ్ జిల్లా నాయకులు జీవీ రావు, అనూరాధ, గాంగేయుడు, చెన్నకేశవరావు, పద్మకిషోర్ తదితరులు విజయకుమార్ పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పశువుల నుంచి పంటలు కాపాడాలని వినతి



నూజివీడు టౌన్, జూలై 5: పశువులు పంటలను నాశనం చేస్తోంటే వాటి యజమానులు రైతుల పై తిరిగి దాడులకు దిగుతున్నారని, వారి నుంచి తమకు రక్షణ కల్పించాలని కోరుతూ నూజివీడు మండలం వెంకటాయపాలెం గ్రామానికి చెందిన పలువురు రైతులు, నూజివీడు పోలీసులను ఆశ్రయించారు. రెండురోజుల క్రితం నూజివీడు మండలం ఓగిరాల తండాకు చెందిన పశువులు కొన్ని పూజారి పెదగోపాలకృష్ణయ్య వరి నారుమడిని ధ్వంసం చేశాయి. ఈ నేపథ్యంలో సదరు పశువులుఎవరివో తెలియక ఇంటివద్ద కట్టివేయగా, ఓగిరాల తండాకు చెందిన బూక్యా రంగనాథ్, బూక్యా తిరుపతిరావు తదితరులు గోపాలకృష్ణయ్య ఇంటివద్దకు వచ్చి వారిపై దాడికి దిగటమే కాక, బెదిరింపులకు పాల్పడ్డారని వారిపై చర్యలు తీసుకోవాలని వెంకటాయపాలెం రైతులు పోలీసులను ఆశ్రయించారు. పశువులను నిలువరించ కుంటే తాము ఆర్థికంగా నష్టపోతు న్నామని, పశువులను వదలవద్దన్న ప్రతిసారి తండా వాసులతో తమకు గొడవ అవుతోందని, తమపై దాడి చేసి చంపుతామని బెదిరించిన వారిపై చర్యలు తీసుకోవాలని నూజివీడు రూరల్ సీఐ రామ కృష్ణకు, సబ్ కలెక్టర్ కార్యాల యం లోనూ ఫిర్యాదు చేశారు. రైతులు పూజారి గోపాల కృష్ణ, పాండు రంగారావు, సాయి, వెంకటేశ్వరరావు, గంగాధర్‌రావు, రామ కృష్ణ పాల్గొన్నారు.